# మరో సూర్యుడు ఉదయించాడు

**కొమ్మూరి వేణుగోపాలరావు**

సముద్రుడు అనంతవిస్తారంలా గోచరించే మహాగోళాన్ని, ఎర్రగా వెలిగిపోయే సూర్యబింబాన్ని కొద్దిసేపటిలో కబళించివేస్తాడు

—వొట్టి సముద్రుడుకాదు.

మూడు మహాసముద్రాలు కలిసే అపురూప ప్రదేశం.

తీరాన్నంతా ఆ అపూర్వ దృశ్యాన్ని చూడడానికి ఎక్కడ చూసినా పడితే అక్కడ జనం.

వివేకానంద రాక్ కేసిల్ కూడా మనుషులతో నిండిపోయివుంది.

దూరాన, ఎక్కడో కనిపించీ కనిపించనట్లు. నీటి అంచున మునిగిపోతున్నట్లు ఒకటీ, అరా పడవలు కదులుతున్నాయి.

సూర్యబింబం సముద్ర గర్భంలో కలిసిపోవడానికి ఇంకో అరగంట వ్యవధి వుంది.

అనంతమూర్తి ఇసుకలో అడుగుతీసి అడుగు వేస్తూ, "ముందుకు వెడితే ఇంకా బాగా కనబడుతుంది, ఇంకా బాగా కనబడుతుంది" అనుకుంటూ నడుస్తున్నాడు.

అతను నిన్న రాత్రే కన్యాకుమారి వచ్చాడు

తెల్లవారు ఝామునే లేచి లాంచిమీద వివేకానంద రాక్ కేసిల్‌కు వెళ్ళి అక్కడ వందలాది ప్రజల మధ్య నిలబడి సూర్యోదయ దృశ్యాన్ని తిలకించాడు. సూర్యుడు అనంత వ్యాప్తమైవున్న నీటి మధ్య, ఎక్కడున్నించో కొత్త కొత్త బయటకు చొచ్చుకు వస్తాడు. తర్వాత చెంగవిడిపించుకున్నట్లు పూర్తిగా బయటపడిపోయి, ఏ మేఘాల మధ్యనో కాసేపు సేదతీర్చుకుని యిహ ప్రయాణం మొదలు పెడతాడు.

అది చూడ్డం అయిపోయాక, ఆ కొండ మీద మందిరమంతా కలయతిరిగి, అక్కడి విశేషాలు చూస్తూ తర్వాత ఆ లైబ్రరీలో తనకు కావలసిన పుస్తకాలు కొన్ని కొనుక్కున్నాడు

వివేకానందుడు అమెరికా వెళ్ళేముందు మానసిక పరిపక్వత కోసం అటూ యిటూ చాలా చోట్లు తిరిగి యిక్కడికి వచ్చాక ఈ ప్రదేశం ఆకర్షించిందట. తీరాన్నుంచి దాదాపు మైలుదూరం వున్న కొండ దగ్గరకు ఈదుకుంటూ వెళ్ళి, అక్కడ మూడు రోజుల పాటు అన్నం. నిద్ర లేకుండా తపస్సులాంటి సమాధిలో వుండిపోయాడట. అక్కడే అతడికి మనసు వికసించి పూర్ణ విజ్ఞానం కలిగిందట.

అదయ్యాక, ప్రొద్దుటనుంచే యింత వరకూ, గుడి గోపురాలు చూడటం, తనకు నచ్చిన గవ్వలు, చిన్న చిన్న బొమ్మలు కొనుక్కోవడం యిత్యాదులు పూర్తిచేసుకుని, యిప్పుడు సూర్యాస్తమ

యాత్రి సందర్శింపటానికి వచ్చే సముద్ర తీరం వచ్చాడు.

అరవై ఏళ్ళవాడైనా అతని ముఖంలో వార్ధక్యఛాయలంతగా కనబడటంలేదు. జుట్టు చాలావరకు తెల్లబడిందిగాని, ఎక్కువగా రాలిపోలేదేమో. బట్టతల చిహ్నాలేమిలేవు. కళ్ళచుట్టూ నలుపు చారల్లాంటివేమీ లేవు. కళ్ళలో కాంతి నశించలేదు.

ప్యాంటూ, షర్టు వేసుకున్నాడు. వెన్ను వొంగలేదు. నిటారుగా, హుందాగా నడుస్తున్నాడు. అడుగుల కదలికలో ఆరోగ్యంతోబాటు, మనిషిలోని ఆత్మవిశ్వాసం కూడా ప్రస్ఫుటమౌతోంది.

“ఇంకా ముందుకు .... యింకా ముందుకు” అనుకుంటూ నడుస్తున్నాడు.

ఉన్నట్టుండి ఆగిపోయాడు. అతని చూపులు యిసుకలో ఓ ప్రక్కన తల వొంచుకు కూర్చున్న ఓ వ్యక్తిమీద పడ్డాయి.

‘ఎవరది? రాఘవకాదు కదా” అనుకున్నాడు. దగ్గర కెళ్ళాడు.

ప్రక్కనే ఓ మనిషి నిలబడటం గమనించి ఆ వ్యక్తి తల ఎత్తాడు. అవును రాఘవే

“రాఘవా!” అన్నాడు అనంతమూర్తి ఆనందాశ్చర్యాలతో.

ఆ వ్యక్తికి గడ్డం బాగా పెరిగివుంది. డెబ్బైయిఏళ్ళవాడిలా కనిపిస్తున్నాడుగాని, అరవై కన్నా ఎక్కువ వుండి ఉండవు. నెత్తిమీద జుట్టు ఏమూలనోతప్ప ఊడిపోయింది. కళ్ళలో కాంతి తరిగిపోయి గాజు కళ్ళలా అనిపిస్తున్నాయి. పంచా, చొక్కా వేసుకున్నాడు. అవి శుభ్రంగానే వుంచి వుండవచ్చుగాని మనిషిలోని వెత్తిని మాత్రం దాచలేకపోతున్నాయి.

“మూర్తి! నువ్వా?” అన్నాడు. అతని కంఠంలో ఆనందమూలేదు, ఆర్ద్రతాలేదు. పొడిగా వుంది.

“అవును నేనే. మన అనంతమూర్తిని” అంటూ యిసుకలో అతని ప్రక్కన కూర్చున్నాడు.

“ఎప్పుడొచ్చావు?”

“రాత్రి. నువ్వు?”

“ఇక్కడే వుంటున్నాను.”

“అంటే?”

“వివేకానందాశ్రమంలో వుంటున్నాను సంవత్సరంబట్టీ.”

“నీ కోసం చాలామందిని అడిగాను. చాలా వాకబు చేశాను. చివరకు ఇక్కడ దొరికావు.”



"దొరకలేదు. కనిపించాను."

"అంటే?"

"జీవితం నాకు దొరకలేదు. నేనే అందరకూ దొరుకుతూవచ్చాను. ఇహ దొరకను"


"ఈ వయస్సులో ... యిహ దొరికి లాభంలేదు" అనంతమూర్తి నవ్వాడు.

రాఘవరావు నవ్వలేదు. పడిలేచే సముద్రపు తరంగాలవైపు చూస్తున్నాడు అతని ముఖంలో కూడా భావకెరటాలు బలహీనంగా పడిలేస్తున్నట్లు కదులుతున్నాయి.

చెయ్యి చాచి స్నేహితుడిచేతిని అదిగా పట్టుకున్నాడు. బలమైన అతని వ్రేళ్ళ మీద, బలంలేని యితని వ్రేళ్ళు జాలిగా వొణుకుతున్నాయి.

"మూర్తి! గుర్తుందా?" అన్నాడు చేతి వ్రేళ్ళ వొణుకు గొంతుదాకా ప్రాకినట్లనిపించింది.






"దేన్ని గురించి....?"

"ఇలాంటిదే సముద్రం. ఇలాంటివే తరంగాలు. ఇంత మధురంగానే హోరు...."

అనంతమూర్తికి తాము పుట్టి పెరిగిన కాకినాడ, ఆడుకున్న సముద్రంతీరం, అప్పటి సంఘటనలూ కళ్ళముందు కదలాడుతున్నాయి.

"తరుచు దూరమైనా సముద్ర తీరానికి వెళ్ళేవాళ్ళం."

అనంతమూర్తి తల ఊపాడు.

"అప్పుడో మాట చెప్పాను."

అనంతమూర్తి ఆలోచిస్తున్నాడు.... అతనికి తెలుసు.

"అప్పుడో మాట చెప్పాను. చిన్న మాటే అది. గుర్తుందా అది?" ఈసారి రాఘవరావు గొంతు కఠినంగా పలికింది.

అనంతమూర్తి వేళ్ళు స్నేహితుడి వేళ్ళచుట్టూ ప్రేమగా బిగుసుకున్నాయి.

"గుర్తున్నది" అన్నాడు విచారంగా.

సముద్రం హోరుపెట్టింది.

* * *

అప్పుడిద్దరికి పదిహేనేళ్ళు వుంటాయేమో. ఇద్దరూ స్కూల్ ఫైనల్ పరీక్షలు రాశారు. మిగతా వాళ్ళందరి కన్నా మొదట్నుంచీ దోస్తీగా వుండేవారేమో, సెలవుల్లో సమయం వచ్చినప్పుడల్లా కలిసి తిరుగుతున్నారు.

ఇద్దరికీ మనసులు అంతగా దగ్గరవటానికి ఓ కారణముంది. ఇద్దరిలో ఏ మాత్రమో కళాభినివేశం వుంది. అప్పట్లో సరిగ్గా స్వరూపాలు ఏర్పడలేదుగాని, మిగతా వేళల్లా రోడ్ల మీద బలాదూరు తిరక్కుండా ఏ సాహిత్యసభలకో సంగీత కచేరీలకో, నాటకాలకో నిధిగా వెడుతూ వుండేవాళ్ళు. అనంతమూర్తికి పుస్తకాల పిచ్చి జాస్తిగా వుండేది. కనబడ్డ పుస్తకమల్లా వెర్రిగా చదివేవాడు. రాఘవరావుకు సంగీతమంటే అభిమానం. తనో గొప్ప గాయకుడయినట్లూ. లేక ఏ వీణో, ఫిడేలో అద్భుతంగా వాయించే వాద్యగాడయినట్లూ కలలు కనేవాడు.

ఓ సాయంత్రం అనంతమూర్తి స్నేహితుడింటికి వెళ్ళాడు. ఎక్కడికో వెళ్ళాడంది వాళ్ళమ్మగారు.

తను ఊళ్ళో వుండనని చెప్పాడు అంతకు క్రితం రోజు. అందుకని తన కోసం ఎదురుచూసి వుండడు. అప్పుడప్పుడు యిద్దరూ కలిసి సముద్రంకేసి వెళ్ళటం అలవాటు. అందుకని అతన్ని వెతుక్కుంటూ అటే వెళ్ళాడు.

రాఘవరావు కనిపించాడు. కాని అతను ఒంటరిగా లేడు. ఇంచుమించు తన యీడు వాడే-ఓ బెస్త పిల్లవాడితో మాటాడుతున్నాడు. ఆ బెస్త పిల్లవాడి చేతిలో ఓ పిల్లనగ్రోవి వుంది.

"మూర్తి! వచ్చావా? నువ్వు వూళ్ళో లేవనుకున్నాను. ఈ అబ్బాయి ఫ్లూట్ ఎంత బాగా వాయిస్తాడో తెలుసా?" ఉత్సాహంగా అని "ఏదీ యింకోసారి వాయించూ. నా ఫ్రెండ్ వింటాడు" అనడిగాడు.

ఆ పిల్లవాడిది గిరజాల జుట్టు. గోచీ పెట్టుకుని వున్నాడు.

అడగగానే కాదనకుండా పిల్లనగ్రోవి పెదవుల దగ్గర పెట్టుకుని వాయించసాగాడు

గానంలో పరిపక్వత వున్నట్లు లేదుగాని వింటానికి మాత్రం చాలా శ్రావ్యంగా వుంది. మళ్ళీ మళ్ళీ వినాలనిపించేటట్లుగా వుంది. ఇద్దరి హృదయాలూ బరువెక్కాయి చాలాసేపు మళ్ళీ మళ్ళీ పాడించుకుని విని, యిహ చీకటిపడేటట్లు వుందని యింటిదారి పట్టారు.

దార్లో రాఘవరావు ఎక్కువ మాట్లాడలేకపోయాడు. కలల్లో తేలిపోతున్నాడు. అనంతమూర్తి ఎన్నోసార్లు పలకరించినా అతని చెవులకి వినిపించలేదు.

ఇద్దరూ విడిపోయే దారి వచ్చింది.

"వెడుతున్నాను" అని మూర్తి ప్రక్కసందులోకి తిరగబోయాడు.

హఠాత్తుగా తెలివిలోకి వచ్చినట్లు రాఘవ "మాట" అని అతణ్ణి చెయ్యి పట్టుకు ఆపాడు.

"నాకేది కావాలో యివేళ నాకు తెలిసింది. నేను నిశ్చయించుకున్నాను. అప్పన్నేను నిశ్చయించుకున్నాను. నేను ఫ్లూట్ నేర్చుకుంటాను. అందులో ప్రావీణ్యం సంపాదిస్తాను. అందులో మొనగాడినవుతాను."

ఇలా అని అక్కడ ఒక క్షణం ఆగకుండా తన సందులోకి మళ్ళీ గబగబ నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

ఇద్దరూ పరీక్ష ప్యాసయ్యారు.


ఈ లోపల రాఘవ కష్టపడి ఓ పిల్లనగ్రోవి సంపాదించాడు. వీలయినప్పుడల్లా ఆ బెస్త పిల్లవాడిదగ్గరకు వెళ్ళి నేర్చుకు వస్తూండేవాడు.

ఇద్దరికీ యింటర్మీడియట్ లో సీటువచ్చి కాలేజిలో చేరారు.

చేరేముందు రాఘవ తండ్రి కొడుకుని

దగ్గరకు పిలిచి ఇలా అన్నాడు. "మన మేమీ ఆస్థిపరులం కాదు. సామాన్య కుటుంబీకులం. కష్టపడి చదువుకుంటేనేగాని ఈ సమాజంలో నెట్టుకు రాలేము. నువ్వీ మధ్య ఫ్లూట్ అనీ గిటారు అనీ వెధవ్వేషాలు వెయ్యటం చూశాను. చదువుకుని బాగుపడదలుచుకుంటే అలాంటివన్నీ మరిచిపో. ఆ ఫ్లూట్ నీకు కూడుపెట్టదు. చదువుకుని డిగ్రీ సంపాదించుకుంటే ఉద్యోగస్థుడివి అవుతావు. నా మాట పై గౌరవం వుంచావా? పైకివస్తావు... లేదా? నీ కర్మానపోతావు."

రాఘవకు పెద్ద వాళ్ళ మాటమీదఎంతో గౌరవ మర్యాదలున్నాయి. అంతేగాక వాళ్ళ తండ్రి అన్నా, తల్లి అన్నా వర్ణించలేనంతటి ప్రేమాభిమానాలు. వాటికి అవధులు లేవు.




తర్వాత తర్వాత ఫ్లూట్ ఎప్పుడు చేతిలోకి తీసుకుందామని ప్రయత్నించినా అతనికి తండ్రి మాటలే గుర్తువస్తూండేవి. ఏదో తప్పు చేస్తున్నట్లు సిగ్గుపడిపోయేవాడు.

అదే రోజుల్లో అనంతమూర్తి జీవితంలో కొన్ని మార్పులు రాసాగాయి. కాలేజి లైబ్రరీలోని అనేక యింగ్లీషు నవలలు చదవటం తటస్థించింది. అతన్లో సాహిత్యంపట్ల ఏవేవో ప్రేరేపణలు కలగసాగాయి. క్రమంగా అతనికి రాయాలన్న అభిలాష కలిగింది. రాయసాగాడు కూడా.

క్లాసు పరీక్షల్లో రాఘవకు మార్కులు బాగానే వచ్చేవి. ఇదివరకు రాఘవకన్న బాగా మార్కులు వచ్చే మూర్తికి క్రమంగా రాంక్ తగ్గిపోయింది.

రాఘవ బాధపడ్డాడు. "మూర్తీ, నువ్వు వెనక్కి వెళ్ళిపోతున్నావు."

మూర్తి నవ్వాడు. "వెనక్కి వెళ్ళటం లేదు. చదువులో వెనక పడుతున్నాను."

"అదే నే చెప్పేది. నీకు పుస్తకాలమీద మోజు మరీ ఎక్కువయి పోతోంది. ఎప్పుడూ పేజీలకు పేజీలు ఏదో రాస్తూంటావు కూడానూ. ఎందుకిలా టైం వేస్ట్ చేస్తూంటావు?"

"జీవితాన్ని వేస్ట్ చేసుకోవటం యిష్టం లేక."

రాఘవ అర్థం కానట్లు చూశాడు.

మూర్తి మళ్ళీ నవ్వాడు. "ప్రతి వ్యక్తికీ జీవితంలో ఒక టేస్ట్ అంటూ వుంటుంది. ఫాన్సీ వుండాలి. ఫాన్సీ నాకు వుంది. ఆ టేస్ట్‌కు వ్యతిరేకంగా ఫాన్సీ చంపేసుకుని జీవిస్తే - జీవితాన్ని వేస్ట్ చేసుకోవడమే అని నా ఉద్దేశం."

"నువనుకుంటూన్న టేస్ట్ నీ జీవితానికి మెరుగులు దిద్దకపోతే,"

"మరుగునపడిపోతాను. మనిషి అనేక పరిస్థితులలో, సందర్భాలలో మరుగున పడిపోతూ వుంటాడు. తను అనుకున్నది అనుభవించే ప్రయత్నంలో ఓడిపోవడం, తనది కాని జీవితం బ్రతుకుతూ ఓడిపోవడంకన్నా ఎన్నోరెట్లు నయంకదూ."

"మీ తల్లిదండ్రులు నీకెప్పుడూ చెప్పలేదా?"

"ఏమని?"

"పద్ధతి మారు-కొమ్మని."

"తల్లిదండ్రులుగా వాళ్ళ అభిప్రాయం వాళ్ళు చెప్పారు. నా నిర్ణయాన్ని నేను మార్చుకోలేకపోయాను. విసుక్కున్నారు. మందలించారు. బాధపడ్డారు. నేను నేనుగానే వుండిపోతున్నాను:

రాఘవ నిట్టూర్చాడు. "తప్పు; తల్లిదండ్రుల్ని గురించి అలా మాట్లాడకూడదు మూర్తి" అన్నాడు.

మూర్తికి అర్థం కాలేదు. "నేనేం తప్పు మాట్లాడలేదే." అనుకున్నాడు.

* * *

అనంతమూర్తి పంపగా పంపగా, ఎన్నో తిరిగి రాగా చివరకు అతని కథలు రెండు అచ్చయినాయి.

రాఘవ అతన్ని అభినందించాడు.

అదే రోజుల్లో రాఘవ తల్లిదండ్రులు తీర్థయాత్రలకని రెండు నెలలపాటు దూరంగా వెళ్ళిపోవటం జరిగింది.

రాఘవ యింట్లో ఒక్కడే వున్నాడు.

భోజనం గురించి అతనికి బాధలేదు. అతనికి చిన్నప్పట్నుంచీ వంట చేయటం వచ్చు. కూరలు తరగటం. కుంపటి అంటించటం, తిరగమూతలు పెట్టటం అవలీలగా చేసేవాడు. వండుకుని తిని కాలేజికి వెళ్ళి వస్తూండేవాడు.

కాని జీవితంలో యిన్నిరోజుల ఒంటరితనం యింట్లో ఎప్పుడూ అనుభవించలేదు. పగలు కాలేజీ, చదువు. ఈ వ్యాపకాల్లో గడిచిపోయేదిగాని, రాత్రుళ్ళు దిగులుగా, గుబులుగా వుండి ఏడుపు వస్తోన్నట్లుగా వుండేది. ఒకరోజు ఇహ ఏకాంతం భరించలేక పెట్టెలో బట్టల అడుగున పడేసి వుంచిన పిల్లనగ్రోవి తీసి వాయించసాగాడు.

ఎన్నాళ్ళయిందో ఈ మురళి తన పెదవుల్ని తాకి? ఎన్నాళ్ళయిందో మురళి మీద తన పెదవులు వదిలి?

అనుభూతి చాలా మధురంగా వుంది. అప్పుడే తా నిందులో కొంత ప్రావీణ్యం సంపాదించానన్న విషయం కూడా గ్రహించాడు. ఉత్సాహం ఆపుకోలేకపోతున్నాడు. ఈ పెద్దవాళ్ళూ, ఈ నియమాలూ, ఇదంతా మిధ్య అనీ. కల్పితం అనీ, తనూ తన చేతిలో మురళి ఇదే నిజమైన ఆనందమనీ పదే పదే అనుకున్నాడు.

ఇహ వ్యామోహం ఆపుకోలేకపోయాడు. కాలేజీ నుంచి ఇంటికి రాగానే అదే ధ్యాస, అదే తపన రాత్రుళ్ళు టైము కూడా తెలిసేదికాదు.

ఓ రోజు ఉదయం స్నానం చేసి

దీపావళి శుభాకాంక్షలతో




సేల్సు బ్రాంచిలు: శివాలయం వీధి, విజయవాడ-1; ఏలూరురోడ్, విజయవాడ-2; మెయిన్‌బజార్, ఏలూరు; చిక్కడపల్లి, హైదరాబాద్-20.



ఇంట్లోకి వెడుతూ ప్రక్కింట్లో కొత్తగా దిగినవారి తాలూకు పదహారేళ్ళ అమ్మాయి వాళ్ళ గుమ్మంలో నిలబడి తనవంక కన్నార్పకుండా చూడటం గ్రహించి సిగ్గుపడి లోపలకు వెళ్ళిపోయాడు.

బట్టలేసుకున్నాక ఆ అమ్మాయి అక్కడ ఇంకా వుందో లేదోనని. ఏదో పని వున్నట్లు నటిసూ పెరట్లోకి వచ్చాడు.

ఇంకా అక్కడే నిలబడి వుంది.

ఏం చెయ్యాలో తెలీక, పట్టుబడినట్లయిపోయి బలవంతంగా నవ్వాడు.

ఆ అమ్మాయి కూడా నవ్వింది.

అక్కడ్నుంచి వెళ్ళిపోదామనుకుని, ఎలా వెళ్ళిపోవాలో కుదరక నిలబడిపోయాడు. కాని అలా నిలబడిపోవటం మనసులో మళ్ళీ బాగానేవుంది.

"రాత్రిళ్ళు మీరేనా ఫ్లూట్ వాయించేది?" ఆ అమ్మాయే ముందుగా పలకరించింది.

అతనికి గర్వం కలిగింది. కళ్ళలో ఆనందం తొణికిసలాడింది. అవుననట్లు తల ఊపాడు.

"మీరు చాలా బాగా వాయిస్తారు."

అతను తికమకపడ్డాడు. "అబ్బే! నాకేమీ రాదండీ. ఏమీ తోచక....అంతే" అంటూ నావ్వేశాడు.

"బాగా వచ్చిన వాళ్ళంతా అలానే అంటారులెండి."

ఇంతలో "అమ్మా! సీతా!" అంటూ లోపల్నుంచి వాళ్ళమ్మగారు వేసిన కేక వినిపించింది.

"ఆఁ వస్తున్నా" అంటూ ఆ అమ్మాయి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి అతను ప్రక్కమీద కూర్చుని ఫ్లూట్‌మీద స్వరాలు పలికిస్తుంటే — ప్రక్కింట్లోంచి ఓ పదహారేళ్ళ పిల్ల తన అమాయకమైన కనులు తెరిచి పడుకుని, చెవులను ఈ ఇంటిమీదే వుంచి, మధురమైన అనుభూతిలో మునిగి వుందన్న భావన అతని మనసులోంచిపోవడంలేదు. నూతన ఉత్తేజం కలుగుతుంది. తర్వాత పడుకున్నా ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు.

మరునాడు ఆమెకోసం అతని కళ్ళు వెదికాయి. కనిపించలేదు.

ఆ మరునాడు కందిపచ్చడి తినాలనిపించి పెరట్లో రోట్లో పచ్చడి రుబ్బేస్తున్నాడు.

ఆ పిల్ల చూడనే చూసేసింది.

ఫక్కుమని నవ్వింది.

సిగ్గుపడిపోయాడు. తలవంచుకుని పని పూర్తిచేసుకుని, లోపలకు వెళ్ళి పచ్చడేసుకుని అన్నం తిని కాలేజీకి వెళ్ళిపోయాడు.

"మీకు వంట చెయ్యటం వచ్చా?" అనడిగింది ఆ సాయంత్రం పెరట్లో పట్టుకుని.

తల ఊపాడు.

"అబ్బ! మీకు చాలా వచ్చే"

అది అభినందనో, ఎగతాళో అర్థం కాదు.

"కందిపచ్చడి మీ కిష్టమా?"

ముఖం ఎర్రబడింది. ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"సిగ్గయితే చెప్పొద్దులెండి. మీపేరేమిటి?"

"రాఘవ"

"నాపేరు మీకు తెలుసు."

పాత పేర్లలో కొన్ని చాలా అందంగా వుంటాయి. సీత. శకుంతల. రాధ..... యిలాంటివి.

ఇంతలో "అమ్మాయి సీతా!" అన్న కేక వినబడింది లోపల్నుంచి.

"అమ్మో! అమ్మపిలుస్తోంది" అని పరిగెత్తింది.

అలా వోణీ, పరికిణీ వేసుకుని, పరిగెడుతూంటే, పొడుగాటి జడ సర్రున కదులుతూంటే ఎంత బావుంది అనివిస్మితుడయిపోయాడు.

మరో రోజు....

"మీరేం చదువుతున్నారు?"

"ఇంటర్మీడియెట్"

"అబ్బో" అంటూ చక్రాల్లాంటి కళ్ళు త్రిప్పింది.

"మీరు"

"మెట్రిక్ చదివి మానేశాను"

"అదేం?''

"ఇంట్లో ముసలివాళ్ళ గోల వుంటుంది కదా."

"మీ నాన్నగారేం చేస్తారు?"

"ఫారెస్ట్ ఆఫీసర్'


"మీ నాన్నగారి దగ్గర తుపాకీ వుంటుందా?" అని అడుగుదామనుకున్నాడు. మళ్ళీ తెలివితక్కువగా వుంటుందని తమాయించుకుని ఊరుకున్నాడు.

ఇలా అవకాశం వచ్చినప్పుడల్లా మాట్లాడుకుంటూనే వున్నారు. ఎప్పుడూ రెండు మూడు నిమిషాలకంటే ఎక్కువ మాట్లాడుకోలేదు. వాళ్ళమ్మ గొంతు ఏ మూలనుంచో వినిపించేది. ఆదివారమైతే వాళ్ళ నాన్నగారు ఇంట్లో ఉండేవారు

తమ పరిచయాన్ని గురించి మూర్తికి చెబుదామనుకున్నాడు. ఎందుకో ఇబ్బందితా డనిపించింది, అతని ముందు బయటపడలేకపోయాడు.

"నువ్వు రెండు రోజులు కనిపించకపోయినా. నీతో మాట్లాడకపోయినా పిచ్చెక్కినట్లు వుంటుందెందుకని?" ఒక రోజు ధైర్యంచేసి అడిగేశాడు.

కిలకిలమని నవ్వేసింది.



"ఎందుకే నవ్వుతున్నావు?" లోపల్నుంచి వాళ్ళమ్మ గొంతు.

"అబ్బే! ఏం లేదమ్మా" అని గుండె మీద చెయ్యి వేసుకుని నొక్కుకుని లోపలకు పరిగెత్తింది.

మరునాడు....

"నీ నవ్వుకు కారణ మేం చెప్పావు?"

"ప్రక్కింటి అబ్బాయి కంది పచ్చడి రుబ్బుతున్నాడు. చూస్తే నవ్వొచ్చిందని చెప్పాను.

ఛీ! అలా చెప్పవచ్చా?"

"మరేం చెయ్యను? అంతకంటే తట్ట లేదు."

"నిన్న నే చెప్పింది విన్నావా?"

"ఏమిటి?"

కొంచెం కోపం వచ్చింది. "కొన్ని విషయాలు తిరిగి చెబితే బాగుండదు."

"ఓహో అదా!" అని ఆమె కాసేపు

ఆలోచించి "ఏం చేద్దాం? కాకూ అలానే వుంటుంది" అన్నది.

అతనికి శరీరమంతా పులకించింది. "నిజంగానా?"

"అబద్ధం చెప్పలేదు."

ఇలా కాలం తెలీకుండా ఎక్కువ రోజులు గడవకముందే అతని తల్లి, తండ్రి తీర్థయాత్రలు ముగించుకుని వచ్చేశారు. బహుశా జీవితంలో తల్లిదండ్రుల గురించి చికాకుపడ్డ సమయం అదే అయి వుంటుంది. అదయినా కొన్ని క్షణాలే. తర్వాత పెద్దవాళ్ళపట్ల అతనికున్న భక్తి గౌరవాలు ఆ చికాకును మటుమాయం చేశాయి.

వస్తూనే తండ్రికి మంచంమీద పడి వున్న పిల్లనగ్రోవి కళ్ళబడింది.

"ఊహూ, మళ్ళీ మొదలుపెట్టావా?" అన్నాడు ముఖమంతా ఎర్రబడగా.

"అమ్మో, నాన్నకి కోపం వచ్చింది" అని బాధపడ్డాడు. "ఇంట్లో ఒక్కడినే వుంటే తోచలేదు నాన్నా. అందుకని" అంటూ నసిగాడు.

"సరే, ఇంకెప్పుడూ ఆ పొరపాటు చెయ్యకు."

మళ్ళీ పిల్లనగ్రోవి పెట్టెలో బట్టల అడుక్కి వెళ్ళిపోయింది. వాళ్ళ యింట్లో ఆ మధురధ్వని వినిపించడం మానేసింది.

వారం రోజులకుగాని సీతతో మాట్లాడటానికి వీల్లేకపోయింది. అక్కడ వాళ్ళమ్మ, ఇక్కడ వీళ్ళమ్మ, నాన్న.

ఓ సాయంత్రం తండ్రి ఇంట్లోలేడు. తల్లి ఎక్కడో పేరంటం వుంటే వెళ్ళింది.

సీత ప్రక్కింటి గుమ్మం దగ్గరకు వచ్చింది.

"ఫ్లూట్ వినబడటంలేదేం?"

"మా నాన్నగారు వచ్చేశారు."

ఆమె ఆశ్చర్యంగా చూసింది. "మీ నాన్నగారు రావటానికీ, ఫ్లూట్ ఆపెయ్యటానికి సంబంధ మేమిటి?"

"ఆయన కిష్టంలేదు."

"ఎందుకని?"

"సరిగ్గా తెలియదు. ఇష్టంలేదు మరి."

"ఆయన కిష్టంలేకపోతే మీరు ఆపేస్తారా?"

"పెద్దవాళ్ళ కిష్టంలేకపోతే అంతే మరి...."

సీత అతనివంకచూసింది. ఆచూపులో విచారం వుంది, బాధవుంది. అతని

---

1920 లో సహాయ నిరాకరణోద్యమ సందర్భంలో ఆంధ్రుల కర్తవ్యం నిర్ణయించటానికి మహానంది క్షేత్రంలో జరిగిన ఆంధ్ర మహాసభకు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కాషాయాంబరాలు, రుద్రాక్షమాలలు, పెద్ద కుంకంబొట్టు ధరించి వచ్చి, మహోపన్యాసాలిచ్చారు. కృష్ణాపత్రికలో ఆయన వేషం సుంకర కొండయ్యవేషంలా ఉందని, ఎవరో వెక్కిరించారు. దానిపై ఆయన—

"బింకాలు పల్కు బందరు
కుంకల ఘీంకారమెల్లగిడ్వడ సేయన్
శంకరుడె, మహానందిని
సుంకరకొండయగ, వెలసె
చోద్యముగాదే?"

అని ఆశువుగా పద్యం చెప్పి, ప్రతికక్షులను శృంగభంగం చేశాడు.

---

వ్యక్తిత్వాన్ని దెబ్బకొట్టే యింకేవేవో భావాలున్నాయి.

ఏదో అనబోయింది. అని వుంటే ఆ మాట ఎంత పదునుగా వుండేదో! ఇంతలో అనుకోని విధంగా రాఘవ తల్లి అక్కడికి వూడిపడటంతో చప్పున లోపలకు వెళ్ళిపోయింది.

కాని వాళ్ళిద్దరూ మాట్లాడుకోవటం ఆమె కళ్ళపడనే పడింది.

వెంటనే ఆమె ముఖం నల్లబడింది.

"ఏమిటి ఆ అమ్మాయితో మాట్లాడుతున్నావు?" అనడిగింది. ఆవిడ చూడనే చూసింది. ఇహ అబద్ధమాడి ప్రయోజనం లేదు.

"వాళ్ళ యింట్లోకి కొత్తగా వచ్చారమ్మా. మెట్రిక్ దాకా చదివి మానేసిందిట. చదువుకునేందుకు పుస్తకాలేవన్నా వుంటే యిమ్మంటోంది." అన్నాడు కొంత మాత్రం నిజం చెబుతూ.

ఆవిడ అంతటితో వొదిలిపెట్టలేదు. లోపలకు తీసుకెళ్ళి దగ్గర కూర్చోబెట్టుకుని హితబోధ చేసింది. ఈ వయసులో ఆడపిల్లల పరిచయం అయితే దానివల్ల ఎన్ని అనర్థాలున్నాయో తమ చుట్టుప్రక్కల్లో అలా ఎన్ని జీవితాలు బలి అయిపోయాయో, చరిత్రలు ఎలా మారిపోయాయో, ఏకరువు పెట్టింది. అలా చెబుతూ పోతూంటె ఆవిడ గొంతు గద్గదమైపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రాఘవకుకూడా కళ్ళవెంట నీళ్ళు కారాయి. "ఛీ, చాలా తప్పుపని చేశాను. అమ్మ మనసు బాధపెట్టాను" అని కుమిలిపోయాడు.

ఆవిడ "ఇంకెప్పుడూ ఆ పిల్లతో మాట్లాడనని" కొడుకుచేత వొట్టేయించుకుంది.

అప్పట్నుంచీ ప్రక్కింటి గుమ్మంకేసి చూడటం మానేశాడు. అసలు ఎంతో అవసరం వుంటేనేగాని పెరట్లోకి వెళ్ళేవాడు కాదు. వెళ్ళినా తల వంచుకుని, ఇట్టెవెళ్ళి అటే వచ్చేసేవాడు, పది రోజులు అలా గడిచాక ఓ సాయంత్రం కాలేజి నుంచి తిరిగివస్తోంటే సందు మొదట్లో అతన్ని పట్టుకుంది.

"కనిపించటంలేదేం?"

అతను జవాబు చెప్పకుండా తప్పించుకు పోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఆగండి. ఎంతో కష్టపడి మిమ్మల్నిలా కలుసుకో గలగటం సాధిస్తే జారుకుందామని చూస్తారేం?"

ఈ మాటలు గుండెలోకి అభేద్యమైన పొరలను చీల్చుకుంటూ పోగలగాలి. అలా కాకుండా రాఘవ ఎలా నిగ్రహించుకున్నాడో తెలీదు.

"మనం మాట్లాడుకోవటం పెద్దవాళ్ళ కిష్టంలేదు."

"అందుకని."

"మనం ఆపెయ్యాలి."

"అంతేనా?"

అంతే అన్నట్టు ఎటో చూస్తూ కదలకుండా నిలబడ్డాడు.

ఎంత బాధ పడిందో, "సరే...." అంటూ మెరుపులా కదిలి వెళ్ళిపోయింది.

* * *

ఇంటర్మీడియెట్ ఫలితాలు తెలిశాయి. రాఘవ పరీక్ష ప్యాసయ్యాడు. మూర్తి దిపోయింది.

మూర్తి తండ్రి ఇంత ఎత్తున లేచాడు. "నువ్వు మొదట్నుంచీ చదువుమీద శ్రద్ధ చూపలేదు. నేనెంత చెప్పినా వినిపించు

కోలేను. పెద్దవాళ్ళ మాట కాదన్నావు. పుస్తకాలనీ, ఏవేవో వ్యాపకాలనీ అఘోరించావు. నీ తోటివాడే. ఆ రాఘవ చూడు. చక్కగా పరీక్ష ప్యాసయ్యాడు. అతను పెదవాళ్ళ మాట విన్నాడు. నువ్వు వినలేదు. నువ్విలా పరీక్షలు తప్పుతూ కూర్చుంటే చదివించే స్తోమతు లేదు నాకు. నీ యిష్టం ఏం చేసుకుంటావో చేసుకో. నేను మాత్రం పట్టించుకోను."

ఆ రాత్రంతా అనంతమూర్తి చాలా దీర్ఘంగా ఆలోచించాడు.

అప్పట్నుంచే అతని జీవితంలో మార్పు మొదలయింది.

రెండు రోజులు కషపడి వూరంతా తిరిగి ఓ ప్రెస్సులో కంపోజిటర్ పని సంపాదించాడు.

అతని ఉద్యోగం ఏమిటో తెలిసి తండ్రి మండిపడ్డాడు. తల్లి కళ్ళమ్మటనీళ్ళు పెటుకుంది.

అనంతమూర్తి చలించలేదు. పనిలోకి వెళ్ళడం మొదలుపెటాడు.

ఒకరకంగా చూస్తే అతను చేసేది పెద్ద ప్రెస్సే. మామూలు జాబ్‌వర్క్ లాంటిదేగాక ఆ వూరనుంచి వెలువడే ఓ మాసపత్రికా, అడపాతడపా పెద్ద పెద్ద రచయితలు రాసిన ఏవేవో నవలలూ అక్కడ అచ్చవుతూ వుండేవి.

అతను మధ్యాహ్నం పరామ సమయంలో భోజనానికి యింటికి వెళ్ళేవాడు కాదు. అక్కడే ఓ మాసిపోయిన బెంచీ మీద నడుం వాల్చి అచ్చుకోసం వచ్చిన వ్రాతప్రతులూ, ఆ మూలా ఈ మూల పడి వున్న పాత పత్రికలూ తిరగేస్తూ వుండేవాడు. ఆకలేసే ఎదురుగుండావున్న టీ కొట్లోంచి రెండు చపాతీలు, టీ తెప్పించుకుని అదే భోజనంగా మారు కునేవాడు.

అవకాశం వచ్చినప్పుడల్లా చిన్న చిన్న కథలూ, గేయాలు, వ్యాసాలూ రాస్తూ ఉండేవాడు. పత్రికలకి పంపిస్తూ వుండేవాడు.

రెండు మూడు రోజులకోసారి మూర్తి రాఘవని కలుసుకునే వాడు.

రాఘవ ఇంటర్ ప్యాసయ్యాక బి. ఎ. లో చేరాడు.

అతను బి. ఎ. ప్యాసయేసరికి మూర్తి కంపోజిటర్ నుండి ప్రూఫ్ రీడర్‌గా. మారాడు. రచయితగా కొంత పేరు కూడా వచ్చింది.

ఆ రోజుల్లోనే మూర్తి పని చేస్తూన్న ప్రెస్సు యజమాని ఓ పత్రిక పెటాడు. అందులో ప్రతి సంచికలోనూ కనిపించే ఓ శీర్షిక వుంది – "పిచ్చివాడి చేతిలో రాయి' అది బయటవారి చేత రాయిస్తే సకాలానికి అందక పత్రికా ప్రచురణలో ఆటంకాలు ఏర్పడుతూ వుండేవి. మూర్తి సాహిత్య పరిచయం. రచయితగా అతని కున్న పాత్ర ప్రెస్సు యజమానికి తెలుసు కాబట్టి చివరకు ఆ శీర్షిక అతని కప్పజెప్పి ఆ శీర్షిక నడపమన్నాడు. అందులో సంఘంలోని ఆనాటి తాజా సంఘటనలు. పరిణామాలు, రాజకీయాల మీద పరిశీలనలు, అత్యాచారాల మీద దండయాత్రలు. కొంత మంది వ్యక్తుల మీద విసుర్లు, రావలసిన మార్పుల మీద ఆవేదన. ఆవేశంతో కూడిన సలహాలు – ఒకటేమిటి... ఆనాటి సమాజానికి సంబంధించిన సమస్తం ఏదో రూపంలో కనిపిస్తూ వుండేది.

రానురాను ఆ శీర్షికకు పేరొచ్చింది. పాఠకుల దగ్గర్నుంచి అభినందనలతో అనేక ఉత్తరాలు రాసాగాయి. సర్క్యులేషన్ కూడా బాగా పెరిగింది.

రాఘవ ఉద్యోగం వెతుక్కుని తాలూకాఫీసులో గుమాస్తాగా చేరేసరికి మూర్తి పత్రికలో సబ్-ఎడిటరయ్యాడు.

* * *

రాఘవ పెళ్ళిచేసుకున్నాడు.

ఇప్పుడుసీతావాళ్ళు అతనిఇంటిప్రక్కన లేరు. ఆ వూళ్ళోకూడా లేరు. ఎక్కడున్నారోకూడా అతనికి తెలీదు.

సీత అప్పుడప్పుడూ అతనికి గుర్తురాక పోలేదు. మనసులో ఏ మూలనో ఆమె రూపం మెదిలేది. ఒక్క క్షణం అంతే. తర్వాత ఆ తెరల్లో ఎక్కడో మరుగున పడిపోయేది.

పెళ్ళి చేసుకున్నాక రాఘవ లక్ష్మిని ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించసాగాడు. తను ఆమె కోసమే పుటానను కున్నాడు. ఆమె కోసం ఎటువంటి త్యాగమైనా చెయ్యాలనే స్థితికి వచ్చాడు.

కానీ ఓ కొత్త యిబ్బంది వచ్చింది.

అత్తకూ, కోడలుకూ ఓ క్షణం పడేది కాదు. మొగుడూ, పెళ్ళాం కలసి ఎక్కడికైనా బయటకెడితే ఆవిడకు చాలాబాధగా, ఉక్రోషంగా వుండేది. ఆ బాధ ఆ రూపంలో బయటపెట్టేందుకు వీల్లేదు. ఇంకేదో కారణం కల్పించుకుని ఆడిపోసుకునేది. లక్ష్మి కొంచెం ఆలస్యంగా నిద్రలేచేది. ఈ లోగా రాఘవ లేచి స్నానాదికాలు కూడా ముగించుకునేవాడు. ఇది ఆవిడకు దారుణంగా కనిపించేది. ఏదో అనాల్సివచ్చేది. ఆవిడ అన్నప్పుడల్లా లక్ష్మి ఏడుస్తూ పడుకుని ఆ పూట భోజనం మానేసేది. ఆమె అలిగిపడుకుందంటే బ్రహ్మాదులు వచ్చినా ఆ అలక తీర లేకపోయే వారు. రాఘవ యిద్దరిమధ్య నలిగిపోతూ వుండేవాడు. అటు తల్లి అంటే దేవతతో సమానం. ఇటు పెళ్ళాం అంటే పంచప్రాణాలు. కాని ఆ నలిగిపోవటం



అతనికి ఎప్పట్టుగా వుండేదికాదు. ఈ ప్రకృతిలో అదో సహజ పరిణామమనీ, అది అనుభవించటంలో అస్వాభావికం ఏమీ లేదనీ అనుకుంటూ వుండేవాడు.

*  *  *

మూర్తి పనిచేసే పత్రికాఫీసుకు అప్పుడప్పుడూ ఆ పత్రిక యజమానికోసం ఒకాయనతో వాళ్ళమ్మాయి కూడా వస్తూండేది. ఆ అమ్మాయి పేరు వసంత.

ఎర్రగా, చురుగ్గా, లేతగా, మొగ్గలా వున్న ఆ అమ్మాయి రూపం అతన్ని ఆకర్షించింది. అయినా తొందరపడలేదు.

చివరకు ఆ అమ్మాయే ఒకసారతన్ని పలకరించింది. "మీ శీర్షిక చాలా బావుంటోందండీ."

"థ్యాంక్స్" అన్నాడు.

"చాలామంది ఆ శీర్షిక కోసమే పత్రిక కొంటున్నారు?"

నవ్వి ఊరుకున్నాడు.

"మీ కథలు కూడా బాగుంటాయి."

మళ్ళీ "థ్యాంక్స్" అన్నాడు.

"మీ కథలవీ చదివి చాలా ముసలివారనుకున్నాను."

"ముసలివాడ్నే అనుకుంటున్నాను" అన్నాడు నవ్వుతూ.

"ఏంకాదు."

అట్లా పరిచయం మొదలయింది.

ఒకసారి జగన్నాథపురం వంతెన దగ్గర. మరోసారి సర్వవరందగ్గర, ఇంకోసారి సముద్రతీరాన - యిటా కలుసుకుంటూ వుండేవాళ్ళు.

అనంతమూర్తి తండ్రి ఓ రోజు రౌద్రాకారంతో యింటికి వచ్చాడు. "ఏరా? నే విన్నది నిజమేనా? ఎవరో అమ్మాయితో కలిసి ఊళ్ళో ఎక్కడపడితే అక్కడ చక్కర్లు కొడుతున్నావట."

నిజమేనని మూర్తి ఒప్పుకున్నాడు.

అట్లా ఎందుకు చేస్తున్నావని నిలదీసి అడిగాడు.

"నేనా అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నాన"ని చెప్పాడు.

తండ్రి నిర్ఘాంతపోయాడు. చిందులు తొక్కాడు. మూర్తి అమర్యాదగా ఏం చెప్పలేదు. ఎంతో సభ్యతగా, వినయంగానే మాట్లాడాడు.

"ఆ అమ్మాయి కులం ఏమిటి? గోత్రమేమిటి?"

"మన కులంకాదు."

తండ్రి బాధపడ్డాడు. మందలించాడు. బ్రతిమిలాడాడు. తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"క్షమించండి. నా మనస్సు మార్చుకోలేను" అని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

పెళ్ళయిపోయింది.

వేరే కాపురం పెట్టాడు.

మళ్ళీ తండ్రి పెద్ద గొడవ చేశాడు.

"అన్యథా / భావించకండి, తను మన కులం కాకపోవటంవల్ల బహుశా మీరు ఒక దగ్గర వుండేటే రాజీపడలేరు. అనేక సమస్యలు తల ఎత్తుతాయి. అందుకని దూరంగా వుంటున్నాము. దూరంగా వున్నంత మాత్రాన తండ్రి, కొడుకుల సంబంధం తెగిపోయిందని ఎందుకనుకుంటారు? ఒకవేళ నేను దూర దేశంలో ఉద్యోగం చేస్తూ ఉన్నట్లయితే విడిగా వుండమూ? మేము వచ్చిపోతూనే ఉంటాం. కాపరం మాత్రం వేరు" అని వినయంగా స్పష్టం చేశాడు.

*  *  *

"గూడు" అనే దాంట్లో ఏదో ఆకర్షణ వుండే వుంటుంది.

కొందరు జీవితంలో ఏదో ఓ దశలా ఆ గూటిలో దూరి, అందులోనే ఆనందం అనుభవిస్తూ బయటకు రావటానికి నిరాకరిస్తూ వుంటారు.

రాఘవకు ఇప్పుడు తల్లీ తండ్రిలేరు. ఒకరి తర్వాత ఒకరు కాలగర్భంలో కలిసిపోయారు. నలుగురు పిల్లలు.

ఆఫీసులో అతన్తోపాటు చేరిన వారందరికి ప్రమోషనొచ్చింది. అతనింకా అదే స్థితిలో వుండిపోయాడు.

ఏరోజూ ఆఫీసుకు నియమిత వేళలో వెళ్ళటానికి అతనికి సాధ్యమయేదికాదు. ఇంట్లో అతనికి గొప్ప గొప్ప సమస్యలు ఉత్పన్నమవుతూ వుండేవి.

లక్ష్మికి తరచు 'పాపం' వంట్లో బాగుండదు. నడుంనొప్పో, తలనొప్పో, ఏదీ లేకపోతే నీరసమో, గుండె దడో వస్తూ వుంటుంది. చిత్రమేమిటంటే అది ఎంత పాతదే అయినా, నిరంతరం అయినా ఎప్పటికప్పుడు క్రొత్తదిగా ఆమె బాధపడిపోతూ వుంటుంది. అతనూ తల్లడిల్లిపోతూ వుంటాడు.

"లక్ష్మీ? వంట్లో బాగుండలేదా? నువ్వు పడుకో. విశ్రాంతితీసుకో, డాక్టరు దగ్గరకు వెళ్ళి మందుతెస్తాను. వంట నేనేచేస్తాను. నువ్వు లేవమాకు" అంటూమందు తేవటం, ఆవిడతో తినిపించటం వగైరాలు పూర్తి చేసి అన్నంవండి పెద్దపిల్లలయితే వాళ్ళకు పెట్టి, చిన్నపిల్లలయితే పాలు త్రాగించి కంచాలెత్తేసి ఎంగిళ్ళు తీసేసి ఆఫీసుకు వెళ్ళేసరికి గంటన్నర లేటయేది. ఆఫీసరు మండిపడితల వాచేటట్లు చివాట్లుపెట్టేవాడు.

ఇహ ఆమెగారు యింట్లోకి రాకూడని

## వెల్గు రాయబారి

ఇన్ని నాళ్ళ రాత్రులలో
పేరుకున్న అమావాస్య
ఈవేళటి గడువుతోటి
సంధికొచ్చి తీరుతుంది-

పట్టపగలుగా రాత్రిని
ఎవరు తీర్చిదిద్దారని
నిన్నటికే శివార్లలో
నిలిచిపోయి చూస్తున్నది-

తనింతవరకూ చేసిన
పాపాలకు ఊరుచివర
ఒంటరిగా సమాధిలో
వైరాగ్యం నమలుతుంది-

తను కూసిన గుడ్లగూబ
కూతలకే బెదరిపడ్డ
సంఘానికి విడ్డూరం
ఇంత బలం ఎక్కడిదని-

తను వేసిన నలుపు కోటు
చందమామ నల్లటోపి
పెద్ద మనిషిగా తిరిగిన
గుట్టురట్టు అయ్యిందే

ఈ దీపావళి పర్వంలో
ఈ వెల్గుల రాయబారి
జెండాపై దీపశిఖని
ఏ పద్యం చదువుతాడో?

**వడ్డాది సత్యనారాయణమూర్తి**

మూడు రోజులూ పిల్లల్ని కూడా తనే సాకాలి. కాబట్టి సెలవు పెట్టేవాడు.

అంతేగాక అతనికి ఎప్పటికప్పుడు వేరే సమస్యలు ఎదురవుతూ వుండేవి.

భార్య ఏ బంధువులింట్లో ఎళ్ళికో, పడుకోడానికో, బారసాలకో బయద్దేరతిపేది.

"అవునవును, వెళ్ళకపోతె బాగుండదు" అని అతను తు.చ.తప్పకుండా అనుసరించేవాడు.

ఒకసారి అతని బావమరిది పెళ్ళయింది. "బావమరిది పచ్చి ముందుగా వచ్చెయ్యి అక్కయ్యా! నువ్వు తప్ప ఎవరున్నారు మాకు?" అన్నాడు.

రాఘవ "అవును పాపం. వెళ్ళకపోతే ఎట్లా?" అనుకున్నాడు.

వారంరోజులు ముందుగా తరలివెళ్లారు.

ఆఫీసరు అన్నిరోజులు సెలవు యివ్వనని పేచీ పెట్టాడు. సిక్‌లీవనీ అదనీ యిదనీ మొత్తంమీద లాస్ ఆఫ్ పే మీద నిస్సంకోచంగా పెళ్ళాం,బిడ్డలతో వెళ్ళిపోయాడు.

పెళ్ళిలో చాకిరీ అంతా అతనే చేశాడు. పెళ్ళి పూర్తి చేసుకుని పెళ్ళికొడుకుగారింటికి వచ్చాక "డిన్నర్"లో ఏమేమి వంటకాలు చేయించాలో, స్వీటు ఏది వుండాలో, కూరలు ఎన్నివుండాలో అన్నీ అతనే నిర్ణయించాడు. భోజనాల దగ్గర "సర్వ్" చేయటం కూడా అతనికి గొప్ప సరదా. దగ్గరవుండి అన్నం పళ్ళెమో, లేకపోతే పులుసు గిన్నో పట్టుకుని అందరినీ అడిగి అడిగి వడ్డించటంలో ఏదో ఖుషా అనుభవించేవాడు.

అంతా పూర్తయి యిహ బయల్దేరదామనుకుంటూ వుండగా అతని మామగారికి భుజంనొప్పి వచ్చింది. ఆయన యిల్లంతా మోగిపోయేటట్లు మూలుగుతూ పెద్ద హడావుడి చెయ్యసాగాడు.

లక్ష్మి "నాన్నకు వంట్లో బాగా లేదండి. ఈ స్థితిలో మనం విడిచి వెళ్ళిపోతే నలుగురూ ఏమనుకుంటారు?" అన్నది.

"అవును. పాపం! ఈ స్థితిలో వెడితే ఏం బాగుంటుంది?" అని అతను కూడా ఒప్పుకుని లీవ్ ఎక్స్‌టెండ్ చేశాడు.

అంతేకాకుండా లక్ష్మికి దేముళ్ళమీద నమ్మకం అపారం కాబట్టి, ఆమెకు రకరకాల మొక్కులు మొక్కటం అలవాటు కాబట్టి, మోపిదేవిలో ముడుపు చెల్లించటానికో, అన్నవరంలో సత్యనారాయణ వ్రతం చెయ్యటానికో, మందపాకలో శనికి నూనెతో అభిషేకం చేయించి తమకు పట్టిన శని వదిలించుకోవటానికో, లేక ఫలానా ఊళ్ళో వేంచేసివున్న ఫలానా బాబాగార్ని సందర్శించి తీర్థం స్వీకరించటానికో ఆమెతోబాటు ఓపిగ్గా తిరుగుతూ వుండేవాడు. ఇవన్నీ అసహజంగాగానీ, అస్వాభావికంగాగాని ఎప్పుడూ కనబడేవి కావు.

దీపావళి శుభాకాంక్షలతో





అతనిపై ఆఫీసరుకు అతనంటే జుగుప్స. ఎలర్జీ రెండూ పట్టుకున్నాయి.

అతను ఆఫీసు మానేసిన రోజున "ఏమయ్యా! యివేళ విశేషం ఏమిటి? మీ అత్తగారికి వెన్నుపోటు వొచ్చిందా? మామగారికి భుజం వాచిందా? మీ ఆవిడ పేరంటానికి వెడితే తోడు వెళ్ళావా? తద్దినానికి రెండురోజులు ఎగ్గొటావేమిటి? ఓహో శేష భుక్తం తినటానికి ఎక్స్ట్రా కావలి వచ్చిందా..?" యిలా చురుక్కుమనేటట్టు మాట్లాడేవాడు.

రాఘవ చాలా తేలిగ్గా అన్నీ దులిపేసుకునేవాడు. ఎప్పుడయినా ఒకరోజు పిల్లనగ్రోవి గురించి గుర్తు వచ్చేది.

ఒకసారి పెట్టెలోంచి బయటకు తీసి పెదవుల దగ్గర పెట్టుకొని కొంచెం ఊదాడు.

"అబ్బ! ఏమిటండీ! వెధవగోల; నా కసలే తలనొప్పిగా వుంటే ఈ పాడు చప్పుళ్ళేమిటి?" అని అతని భార్య విసుక్కుంది.

ఆమె మనస్సు కష్టపడినందుకు అతను నొచ్చుకుని పిల్లనగ్రోవి మళ్ళీ పెట్లో దాచేశాడు.

* * *

అనంతమూర్తి పనిచేసే పత్రిక అనేక రూపాంతరాలు పొంది, ప్రాచుర్యంలోకి వచ్చి, చివరకు బహుళ ప్రచారం గల వార పత్రికగా నిలిచింది. దాని కతను అసిస్టెంట్ ఎడిటరయ్యాడు.

సాహిత్యం అతని ఊపిరి, పత్రిక అతని ప్రాణం అయింది. ఆఫీసులో కూర్చుని పని చేస్తోంటే టైము తెలిసేది కాదు. అన్నం తినాలనీ, ఇంటికి వెళ్ళాలనీ ధ్యాస ఉండేదికాదు. శీర్షికల విషయంలో గానీ, సీరియల్స్ ప్రచురించటంలోగానీ ఏవేవో నూతన ప్రయోగాలు చేస్తూండేవాడు. పండుగలకి ఏమయినా ప్రత్యేక సంచికలు ప్రచురించాల్సి వచ్చినప్పుడు వర్కర్స్‌తో పని చేయిస్తూ ఒక్కోసారి ఆఫీసులోనో, ప్రెస్సులోనో వుండిపోయేవాడు.

దాంపత్య జీవితంలో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది.

వసంతకు యింట్లో ఒక్కదానికీ తోచేదికాదు. అతన్తో కలిసి భోజనం చేయాలన్న కోరిక ఏనాడూ ఆమెకు తీరేదికాదు. అతన్తో బయటకు వెళ్ళాలనీ, ఊళ్ళు తిరగాలనీ, ఏమిటేమిటో చేయాలనీ తలలుకనేది. అందులోనూ ప్రేమించి చేసుకున్న భర్త.

"ఇందుకేనా మీరు నన్ను పెళ్ళి చేసుకుంది?" అనడిగేసింది ఓరాత్రి పన్నెండు గంటలకు యింటికివచ్చిన భర్తని.

"ఎందుకు?"

"మిమ్మల్ని ప్రేమించాను. మీరూ నన్ను ప్రేమించారు. మీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఒక్కటీ తీరటం లేదు?"

అనంతమూర్తి ఒక్క క్షణం ఆగి అన్నాడు. "నిన్ను ప్రేమించినంత మాత్రాన, పెళ్ళి చేసుకున్నంత మాత్రాన నా విధి నిర్వహణ మానుకుంటానని చెప్పానా?"

"చెప్పలేదు. అయితే?"

పెళ్ళి చేసుకోబోయేముందు నేను ఓ పత్రికలో దీక్షపరుడైన సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నట్లు తెలీదా? అప్పుడూ ఎన్నో

సార్లు ఆఫీసు పనిలోవుండి నీకు యిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయేవాడ్ని. ఎక్కడికో వస్తాను నిన్నుండమని చెప్పి రాలేక పోయేవాడ్ని. అప్పుడు సహించిన దానివి యిప్పుడెందుకు సహించలేకపోతున్నావు?"

"అది ప్రేయసి స్థానం. ఇప్పుడు పెళ్ళాంగా వున్నాను?

"అంటే ప్రేయసి స్థితిలోకన్నా పెళ్ళాం పరిస్థితి దిగజారిందా?"

"దిగజారడంకాదు. అనుభవిస్తోంటే తెలుస్తోంది."

అనంతమూర్తికి ఆమె అంటే జాలి కలిగింది అనునయంగా చెప్పాడు. "చూడూ! ప్రతి మనిషికీ కొన్ని బాధ్యతలు. విధి నిర్వహణలూ వుంటాయి. ఎవరి జీవిత తరహాలనుబట్టి దానికి కొన్ని కొన్ని కుదురుతూ వుంటాయి. కొన్ని కుదరవు. కొంతమందికి కావలసినంత తీరిక వుంటుంది. పేకాటాడుకోటానికీ, ఫ్రెండుతో బాతాఖానీ కొట్టటానికీ. పెళ్ళాన్ని షికార్లకూ, సరదాలకూ త్రిప్పటానికీ ఖాళీ వుంటుంది. అది వాళ్ళ అదృష్టం. ఒక బిజీ డాక్టరున్నాడనుకో. పేషెంటుకి చికిత్స చెయ్యటమే అతని జీవిత పరమావధి. అనుకుంటే అతన్ని ప్రేమించినవాళ్ళు అతని పద్ధతులకి అలవాటు పడాలి వుంటుంది. అతన్ని నిందించి, కోరికలు తీర్చమని అడిగీ, అలిగీ ప్రయోజనంలేదు. నువ్వు నా పట్ల ఎట్లా అసంతృప్తిపడుతున్నావో నీ పట్ల నాకు అసంతృప్తి కలిగే. కలిగిన సందర్భాలు చాలా వున్నాయి తెలుసా?"

వసంత ఆశ్చర్యంగా. నమ్మలేనట్టుగా చూసింది. "నేను నీకు అసంతృప్తి కలిగిస్తున్నానా?"

"అవును. ఎన్నోసార్లు నేను డ్యూటీ ముగించుకుని యింటికి వచ్చినప్పుడూ యింట్లో వున్నా నా వ్యాసంగం అదీ చూసుకునేసరికీ- గాఢ నిద్రలో వుంటావు. అలాంటప్పుడు ఎన్నోసార్లు నీమీద కోరిక కలిగింది. నిద్రలో వున్నప్పుడు నిన్ను కదిలిస్తే ఎలా కసురుకుంటావో తెలుసా? అయినా వ్యామోహం చంపుకోలేక ఎన్నోసార్లు నిన్ను దగ్గరకు లాక్కోవటానికి ప్రయత్నించాను. అన్నిసార్లూ కూడా నీతో అక్షింతలే తిని, చివరకు ప్రక్కకు తిరిగి పడుకునేవాణ్ని. అంతేకాని నిన్నెనాడైనా బలిమిన తీసుకున్నానా?"

ఆమె అలాగే నిర్ఘాంతపోతూ వుండిపోయింది. తర్వాత చర్చ ఏం జరగలేదు.

మంచాలమీదకు చేరాక అనంతమూర్తి ఆలోచిస్తూ గోడవైపు తిరిగి పడుకున్నాడు. అతని ప్రక్కనే ఆమె మెదలకుండా పడుకుంది. చాలాసేపు మౌనంగా గడచిపోయింది,

చివరకు ఆమే వెనకనుంచి అతని గుండెమీద చెయ్యేసి "నిన్ను అన్నిసార్లు బాధపెట్టానా?' అన్నది మెల్లగా.

"మరి ....?"

"నీ మనసులో మాట యిన్నాళ్ళు ఎందుకు చెప్పలేదు?"

"చెప్పి ప్రయోజనం ఏముంది? అవసరంకూడా ఏముంది? ఒకరి స్వభావాలకు ఒకరు అలవాటుపడిపోవటం ఎన్నో అనర్థాలను అరికట్టుతుంది కదా."

"ఇటు తిరిగి మాట్లాడు. అటువైపు తిరిగి మాట్లాడుతోంటే ఏమి బాగాలేదు" అని గట్టిగా తనవైపు లాగింది.

అతను ఆమెకేసి తిరిగాడు. బెడ్‌లైట్ వెల్తుర్లో యిద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు. చూపులు ఒకరిలో తుల్లి ఒకరు తరచటానికా అన్నట్టు తీక్షణంగా, మెత్తగా, సూటిగా. ప్రేమమయంగా. తడిగా, అపేక్షాకాంక్షలతో అలా... ప్రసరించాయి.

"మరి రా" అంది.

"ఇప్పుడు వొద్దులే"

"అబ్బో! బెట్టు చేయబోకు. రా."

"ఇవేళ వొద్దనానుగా."

"రేపు నేను నిద్రలోవుండి నిన్ను మళ్ళీ కసురుకోవచ్చు" ఆమె నవ్వింది.

మొండితనంచేస్తే నేనే విజృంభించవల్సివస్తుంది."

"విజృంభించు".

"నీకు తెలుసు. అదీ కొత్త ఏంకాదులే. అతని ముఖాన్ని తన ముఖం దగ్గరగాచేర్చి అంది. "ఏ భార్యాభర్తల మధ్యా అలాంటి సమయాలు లేకుండా వుండవు'.

"అది నాకు తెలీదు" అతని కళ్ళలోకి మత్తు వచ్చింది. చేతులు బలంగా ఆమెను దగ్గరకు లాక్కున్నాయి.

* * *

రాఘవ జీవితంలో తల్లిదండ్రుల అధ్యాయం మునుపే ముగిసిపోయింది.


పెళ్ళినాడు సప్తపదిలో....

"సమయావ సంకల్పావ హై
సం కియా రోచిష్ణూ
సమనస్యమానే ఇధ మూర్జ
మభి సంద సానే
సంసా మనాం సి సంవృతా
సముచ్చిత్రా న్యాకరం"

అని ప్రమాణం చేశాడు కాబట్టి. కొన్ని సత్యాలను నమ్మినవాడు, వాటిని నమ్మినవాడూ తు. చ. తప్పకుండా ఆచరించేవాడూ కాబట్టి భార్యతోటి అధ్యాయాలు ముగింపు లేకుండా జీవితకాలం వుంటూనే వుంటాయి.

ఒకసారి భార్య గర్భిణిగా వున్నప్పుడు లేడీ డాక్టర్ చూసి "ఈసారి జాగ్రత్తగా వుండాలి. తల్లి బలహీనంగా వుంది" అని చెప్పింది.

ఆమె కాన్పయేదాకా నవమాసాలు లక్ష్మి మోయలేదు. అతను మోశాడు. ఆఫీసులో కూర్చున్నా, యింట్లోవున్నా, అన్నం తింటూన్నా. ప్రక్కమీద పడుకున్నా అదే



ఆలోచన- "లక్ష్మికి సీరియస్ అవుతుం దేమో. లక్ష్మికి సీరియస్ అవుతుందేమో" కళ్ళల్లో నీళ్లు తిరుగుతూ వుండేవి. ఆమెకు కొంచెం నడుము నొప్పివస్తే డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతూ వుండేవాడు. అనంతమూర్తి దగ్గరకు తన బాధ చెప్పుకునేందుకు తరచు వెళ్ళేవాడు. అతను ఆఫీసు పనిలో చాలా బిజీగావుండీ మధ్యలో ఓ సారి తల ఎత్తి ఎంతో ఆప్యాయంగా "ఏమిటి రాఘవా ?" అని పలకరించేవాడు. రాఘవ కొంత చెప్పేవాడు. కొంత చెప్పలేక పోయేవాడు. మూర్తి అర్థం చేసుకుని కొంచెంసేపు అతన్తో కబుర్లు చెప్పి పంపించేవాడు.

కాన్పు సమయంలో ఆసుపత్రిలో చేర్పినప్పుడు బయట వరండాలో పిచ్చెత్తినట్లు తిరిగాడు. జుట్టు పీక్కున్నాడు. బావురుమని ఏడ్చాడు. నేలమీద పడుకుని దొర్లాడు. నానా చేష్టలూ చేశాడు. ఆఖరికి తిరుపతి వెంకటేశ్వరస్వామికి తల వెంట్రుకలిస్తానని మొక్కుకున్నాడు.

చివరకు కొంచెం కష్టమైనా లక్ష్మి సుఖంగానే ప్రసవించింది.

* * *

ఇప్పుడు పిల్లల అధ్యాయమొకటి మొదలయింది. వాళ్ళంటే వంద ప్రాణాలు. ఏడవనివ్వడు. కొంచెం ఏడిస్తే తల్లడిల్లిపోతాడు. ఎత్తుకుని క్షణం దింపడు. ముక్కులు తుడిచి వంపకు రాసుకుంటాడు. పాడుచేస్తే కడుగుతాడు. బల్లదగ్గరకువచ్చి అల్లరిచేస్తూ కాగితాలూ అవీ చింపి, నానా రభస జరుగుతూంటే చిరునవ్వు నవ్వుతూ చూస్తూ వూరుకుంటాడు. మందలించడు.

ప్రొద్దున్నే ఫర్లాంగు దూరంలో వున్న మార్కెట్‌కు కూరలకని బయలుదేరుతాడు. లుంగీ పైకి మడిచి సగం పట్టుకుని ఒకచేత్తో కూరల సంచీ. ఓ చేత్తో చంటి పిల్లాడు భుజంమీదా. వాడిని ముద్దులాడుతూ వాడితో కబుర్లు చెబుతూ నడుస్తాడు. తిరిగి వచ్చేటప్పుడు అతని సంచీ బరువుగా వుండి అంగలోంచి బయటికి ఏ పొట్లకాయో తొంగి చూస్తూ వుండేది.

పిల్లలకి జ్వరంగా వుండి ఆసుపత్రికి వెళ్ళినప్పుడు, యింజక్షన్ చెయ్యవలసి వస్తే "నే ఎత్తుకోలేను. నే చూడలేను" అని నర్సునో, కాంపౌండర్నో ఎత్తుకోమని చెప్పి పీపు యిటుప్రక్క తిప్పి నిలబడి "అయిందా? అయిందా?" అని పదిసార్లు అడిగేవాడు.

ఓ ఆదివారం అనంతమూర్తి, వసంతా వాళ్ళింటికి చూడ్డానికి వచ్చారు.

"రండి. రండి" అని లక్ష్మి సాదరంగానే పలకరించి "లోపలకు తీసుకెడుతూ "మీరు మా యింటి కెప్పుడూ రారు" అంది వసంతతో.

"కారణమేమీ వుండదండి. విశేషమేమీ లేక, కుదరక" అన్నది వసంత.

"ప్రమీలగారింటికి ఎప్పుడూ వెడుతూ వుంటారని తెలిసిందిలెండి" అన్నది లక్ష్మి నవ్వడానికి ప్రయత్నిస్తూ,


## వేదకాలం నాటి ప్రజా సంపద

పూర్వం ప్రతి మానవుడు తనను పాలించే రాజుపై ఆధారపడేవాడు. రాజులు ప్రజా క్షేమము కోరి కొన్ని యాగములు తలపెట్టేవారు. యాగములలో ముఖ్యమయిన పద్ధతి అందులో హోమము చెయటం హోమములో ఋషులు నిర్ణయించిన ప్రక్రియ ప్రకారం హోమ వస్తువులు హోమములో ఉంచి ఆ యొక్క ధూపముద్వారా భగవత్ సాక్షాత్కారము పొంది కోరిన వరములు సిద్ధింపచేసుకొనేవారు. ఉదాహరణకు దశరథ మహారాజు విష్ణువుని పుత్రునిగా, జనక మహారాజు లక్ష్మిని పుత్రికగాను (శ్రీరామునిగాను. సీతగాను) పొంది ఆ హోమశక్తితో రాజ్యములు ఏలి విశ్వాంత రాళములో విశ్వ విఖ్యాత కీర్తిని పొందియున్నారు. ఈ ప్రజా రాజ్యములో ప్రజలే రాజులు గనుక అదే వేద సూత్రముల నాధారముగా చేసికొని ఆ హోమములో ఉపయోగించెడి. వస్తువులతో తయారుచేసిన అంబికా దర్బార్ బత్తిని ప్రతివారు ప్రతి నిత్యం తమ ఇష్ట దైవమునకు తమ తమ గృహములలోను వాణిజ్య సంస్థలలోను వెలిగించి. ఆ పరిమళ ధూపమును భగవత్ కైంకర్యము చేసి తమ తమ కోర్కెలు సిద్ధింపచేసికొనవచ్చును. సామాన్య మానవులు సహితం తరించుటకు ఇది భగవత్ప్రసాదముగా భావించవచ్చును. సుగంధ ప్రియో విష్ణుః అనే నానుడి ప్రకారం అంబికా దర్బార్ బత్తి పరిమళంద్వారా భగవంతుని ధ్యానించండి, తరించండి, ముక్తిని పొందండి.




అంబికా దర్బార్ బత్తి తయారు చేయువారు :

అంబికా కెమికల్ ప్రొడక్ట్సు (రిజిష్టర్డు)

పవరుపేట, ఏలూరు. W.G.Dt

"అదేమీ లేదండి. నా కెవరయినా ఒకటే".

"ఎవరయినా ఒకటే ఎందుకు అవుతుందిలెండి. మొన్న ప్రమీలగారు కలిశారు. మీరు రవ్వల గాజులు చేయించుకున్నారుట. చాలా బావున్నాయని చెప్పింది."

వసంత ఏమీ జవాబు చెప్పలేదు. యిలు నాలుగు మూలలా చూసింది. అది యిల్లులా లేదు. ఒక్క వస్తువు తిరుగా అమర్చిలేదు. విప్పిన బటలన్నీ దండాలకు చిందరగా వ్రేళ్ళాడుతూ. నేలమీద అక్కడక్కడా పొర్లాడుతున్నాయి. పిల్లల స్కూలు పుస్తకాలు ఎక్కడ పడితే అక్కడ బల్లల మీదా, కుర్చీలమీదా. కిటికీల లోనూ, నేల మీదా యిష్టం వచ్చినట్లు పడివున్నాయి. వాళ్ళు వాళ్ళలోవాళ్ళు తిట్టుకుంటూ, అరుచుకుంటూ. మీదకు కలియబడుతూ రామ రావణ యుద్ధం చేస్తున్నారు. మధ్యాహ్నం తిన్న ఎంగిలి కంచాలు వంటింట్లో - పనిమనిషి రాక కోసం ఎదురు చూస్తూ నేలమీద అలానే పడి వున్నాయి. వాటిమీద ఈగలు జుమ్మని ముసురుతున్నాయి.


ముందు గదిలో మూర్తి. రాఘవ మాటాడుకుంటూ కూర్చున్నారు.

మూర్తికి ఎప్పుడోగాని స్నేహితుడింటికి రావటం పడదు. అందుకని తన పత్రికను గురించీ. దానికి వచ్చే రచనల గురించీ ఎన్నో ఆసక్తికరమైన విషయాలు చెబుతున్నాడు. ఈ మధ్య పత్రిక సర్క్యులేషన్ బాగా పెరిగింది. అలా అభివృద్ధిలోకి రావటానికి తనువేసిన పథకాలేమిటో నిర్వహించిన పద్ధతులేమిటో వివరిస్తున్నాడు.

లోపల్నుంచి ప్రతి అయిదు నిమిషాలకూ ఓసారి ఓ పిల్లో, పిల్లాడో వచ్చేవాడు.

"నాన్నా! తమ్ముడుచూడు నాపుస్తకం చింపేశాడు" అని కూతురు ఫిర్యాదు చేసేది.

రాఘవ స్నేహితుడు చెప్పే మాటలు వినటం మానేసి కూతురువంక తిరిగేవాడు చిరునవ్వు ముఖంతో. "ఏమిటమ్మా ఏం జరిగిందసలు ....?" కూతురు చెప్పేది ఆసక్తిగా వినేవాడు. ఆమెను సముదాయించి పంపేవాడు. ఈ కార్యక్రమం ఎంతసేపయినా పటనీ, ఎదురుగుండా ఒక మనిషి కూర్చున్నాడన్న ధ్యాస వుండేది



పిల్ల లోపలకు వెళ్ళాక "ఆఁ ఏమన్నావు?" అనేవాడు మూర్తివేపు తిరిగి.

మూర్తి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టేవాడు.

ఈసారి కొడుకు వచ్చేవాడు.

"నా పలక కనపడటంలేదు నాన్నా-ఎక్కడుందో మరి."

"అలాగా!వస్తున్నానుండు నాన్నా' అని రాఘవ "యిప్పుడే వస్తానుండు" అని స్నేహితుడితో అని లోపలకెళ్ళి కొడుక్కి అప్పటికి అవసరంలేని పలక వెతికిపెట్టి ఏ పావుగంటకో మళ్ళీ వూడిపడేవాడు.

"ఆఁ చెప్పు. చెప్పు. మంచి యింటరెస్టింగ్‌గా వుంది."

మూర్తి మళ్ళీ మొదలుపెట్టేవాడు.

అయిదు నిమిషాలన్నా గడవకముందే చిన్నపిల్లాడు వచ్చేవాడు.

"ముక్కు కారుతోంది నాన్నా. తుడవ్వూ?"

చక్కగా ముక్కుతుడిచి ఆ చెయ్యి లుంగీకి రాసుకునేవాడు.

ఆ కార్యక్రమం అయ్యాక "చెప్పు. ఎక్కడున్నాం మనం?"

మూర్తికి ఓర్పు నశించింది. తన భావాన్ని బయటకు వ్యక్తంచేయలేదుగాని. చెప్పదలుచుకున్నదంతా ఈసారి యింకో పిల్లో, పిల్లాడో వచ్చేప్పే లోపల పొడిగా గబగబా రెండు ముక్కల్లో తేలిచి చెప్పేవాడు.

వసంత లోపల్నుంచి వచ్చి "యిహ వెడదామా?" అంది.

మూర్తి లేచి నిల్చున్నాడు.

చెప్పేసి, బయటకు వచ్చాక. చల్లగానే వుంది కాబట్టి యిద్దరూ నడవసాగారు.

ఇద్దరి గుండెలూ బరువుగా వున్నాయి. ఇష్టంలేని దృశ్యాలన్నీ చూసివచ్చి, వాటి గురించి చర్చించుకోవటం యిష్టంలేనివారిలా మౌనంగా నడుసున్నారు.

వసంతకు అతన్తో ఎంతో చెప్పాలని వుంది. ఇక్కడేకాదు. యిరుగు పొరుగులతో కూడా ఈ విధమైన సున్నితమైన సమస్యలే ఉత్పన్నమవుతూ వుంటాయి.

ముక్తిసరిగా వుంటే గర్వమంటారు. 'ఈవిడకి అహంభావం. తన మొగుడే కదా పెద్ద పత్రిక నడుపుతున్నాడని. ఇన్నిసార్లు పలకరిస్తామా? మనసువిప్పి మాట్లాడదు" అని.

పోనీ చనువుగా వుంటే వేళాపాళా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు రాకపోకలు సాగిస్తారు.

"వంటయిందా? ఈ పూట ఏం చేశావు?" లేకపోతే "భోజనాలైనాయా?" "మీ వారింకా రాలేదా?" యిలా.

కనబడ్డ పత్రికనుగాని, పుస్తకాన్నిగాని బ్రతకనివ్వరు."

అంతేకాదు. ఇంట్లో కనబడే చిన్న చిన్న అందమైన వస్తువులు. లేకపోతే క్యాలెండర్లు లాంటివి. లేకపోతే కిచెన్స్ అలంకారంగా పెట్టుకొనే బొమ్మలు-యివి చూసి "మీ కెందుకండీ యివి? అయినా మీకు బోలెడు వస్తూంటాయి కదా. మాకిలాంటివి సేకరించడం సరదా" అని చొరవగా వాటిని తీసుకెళ్ళిపోతూంటారు.

షాపింగ్‌కు తమతోబాటు రమ్మంటారు. అక్కడ నిర్దాక్షిణ్యంగా అప్పులు పెడేస్తూ వుంటారు.

ఒక మంచి చీరె కొనుక్కుంటే "యిది మీకెందుకు? దబ్బిస్తాము యిచ్చేయండి" అంటాడు.

వసంతకు మనసులో యివే మెదుల్తూ, చికాకుగా వుంది. ఆమెకు లక్ష్మి చాలా కాలంనుంచీ తెలుసు. అయినా యిద్దరూ ఒకరికొకరు దగ్గరగా రాలేకపోతున్నారు. కొంద రంతేనేమో. సంవత్సరాల తరబడి కలుసుకుంటున్నా మనకలనేవి పోనేపోవు.

ఓ రోజు రాఘవ చెమటలు క్రక్కుకుంటూ మూర్తి ఆఫీసుకువచ్చాడు. మనిషి వణికిపోతున్నాడు. కళ్ళు దుఃఖంతోనో, ఆవేశంతోనో ఎర్రబడివున్నాయి. అడుగులు తడబడుతున్నాయి.

మూర్తి సీతో అర్జంటుగా ఒక విషయం

మాట్లాడాలి. గొంతుకూడా సరిగ్గా బయటకు రావటంలేదు.

"ముందు కూర్చో. అదుర్దాపడకు. కాఫీ తెప్పించమంటావా?"

రాఘవ అస్థిమితంగా కూర్చున్నాడు. 'చాలా దారుణం జరిగిపోయింది' అన్నాడు.

మూర్తి టేబిల్ మీద సిగరెట్ ప్యాకెట్ తీసి, సిగరెట్ వెలిగించుకున్నాడు.

"ఏవ్వు."

"మా పెద్దవాడు చెడిపోయాడు."

రాఘవ స్వెగొంతుకు రామానికి పడిపోనేస్తుంటాయి.

"ఏం జరిగింది?"

"వాడు సిగరెట్లు తాగుతున్నాడు."

"ఇంకా?"

"అంతే. వాడు సిగరెట్లు తాగుతున్నాడు. విన్నావా? వాడు సిగరెట్లు కాలుస్తున్నాడయ్యా. అది చాలదా?"

మూర్తి మెదలకుండా కూర్చుని తాపీగా సిగరెట్ కాలుస్తున్నాడు.

"మాట్లాడవేం?"

"ఏం మాట్లాడనా అని ఆలోచిస్తున్నాను."

"అంటే? వాడు చెడిపోయాడంటే చీమ కుట్టినట్లుగా లేదా? వాడ్ని చెక్ చేయవలసిన బాధ్యత మనకు లేదా?"

"నా పాత రోజులు గుర్తు చేసుకుంటున్నాను."

"ఏమిటి నువ్వనేది?"

"నా పన్నెండో ఏట నేను మొట్టమొదటి సిగరెట్టు తాగాను. కొంతమంది స్నేహితులు సర్వవరం తోటల దగ్గరకు తీసుకెళ్ళి అక్కడ బలవంతంచేసి తాగించారు. నాలోకూడా పలోభం వుండబట్టే నేను తాగి వుంటాననుకో. ఆ తరాత అప్పుడప్పుడూ సిగరెట్టు కాలుస్తూనే వచ్చాను. కొన్నాళ్ళకు మా నాన్నకు తెలిసింది. చచ్చేటట్టు బాదాడు. అయినా నాతో అలవాటు మాన్పించలేకపోయాడు."

రాఘవ ఆశ్చర్యంగా చూశాడు. "అందుకని..?"

"సృష్టిలో మన కిష్టంలేనివీ, బాధ కలిగించేవీ, మనసును గుచ్చుతూవుండేవీ అనేకం జరుగుతూ వుంటాయి. వాటిని గురించి బుర్ర బద్దలుకొట్టుకోవటంకన్న కాలమాన పరిస్థితులు కొన్నికొన్ని సహజంగా భావించి వదిలెయ్యటం మేలుకదా".

"నా పరిస్థితిలో నువ్వుంటే ఏం చేస్తావు?"

"స్నేహితుడిగా ముందు హితబోధ చేస్తాను. వినకపోతే ఆ సమస్యతో నా జీవితాన్ని ముడిపెట్టుకు కూర్చోను. చూసీ చూడనట్లు వూరుకుంటాను".

"వాళ్ళిలా కళ్ళముందు చెడిపోతూ వుంటే చూస్తూ వూరుకోమంటావా?"

"ఊరుకోక వాళ్ళగురించి మన ఉనికినీ, జీవితాన్నీ పాడుచేసుకోవటం అంతకన్నా నయంకాదు. పిల్లల గురించి అనుక్షణం పరితపించుకుంటూవుంటే వాళ్ళు చెడిపోరన్న నమ్మకమేమయినా వుందా? తమ పిల్లలకేమి తెలియదని అనుకునే ఎంతోమంది తల్లిదండ్రుల పిల్లలు ఎలాంటి అనుభవాలు కలిగివుంటారో. వాళ్ళెంత దారుణంగా ఆలోచిస్తూ వుంటారో నాకు తెలుసు."




"అయితే డిసిప్లిన్ అనేమాటకు అర్థం లేదా?"

"ఉంది. ఆ డిసిప్లిన్ అనేది చెయ్యిజారి పోయినప్పుడు దాన్నిగురించి వున్మాదంగా ఆరాటపడటం. కష్టాలను కొని తెచ్చుకోవటమే. అయినా కొన్ని కొన్నింటిని స్వల్పమైన విషయాలుగా భావించి వొదిలెయ్యటం మంచిది."

"ఇది నేను స్వల్పమైనదిగా భావించటంలేదు."

మూర్తి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు.

"అయితే నన్నేం చెయ్యమంటావు?" అన్నాడు రాఘవ చివరికి, పిరికిగా.

"దానివల్ల కలిగే నష్టాలు మంచిగా చెప్పిచూడు. వినకపోతే ఒకటికి రెండుసార్లు చెప్పు. అప్పటికీ వినకపోతే యిక పట్టించుకోకు. ఇక వాడ్ని ఆపటం కష్టమని అర్థం చేసుకో."

"సరే" నంటూ రాఘవ లేచి వెళ్ళిపోయాడు, కాని అతను స్నేహితుడు చెప్పినట్లు నిగ్రహం ప్రదర్శించలేకపోయాడు. ఒకటికి రెండుసార్లు వాడు సిగరెట్టు కాల్చే దృశ్యం కళ్ళబడేసరికి ఉద్రేకం ఆపుకోలేక బెల్టు తీసుకుని చావ చితకకొట్టాడు. రెండు రోజులు గదిలో పెట్టి తాళంవేసి కదలనివ్వకుండా చేశాడు. కాని ఎన్నాళ్ళు బందిఖానాలో వుంచడానికి వీలవుతుంది? మూడోరోజు హెచ్చరికలు చేసి, అల్టిమేటమ్లు యిచ్చి స్కూలుకు పంపించేసరికి, వెళ్ళినవాడు ఆ సాయంత్రం యింటికి రాలేదు.

ఆఫీసు నుంచి రాఘవ యింటికి చేరేసరికి లక్ష్మి ఒకప్రక్క దీర్ఘాలు తీస్తూ ఏడుస్తూనే. మరో ప్రక్క నుంచి అతని మీదకి కయ్యమని లేచింది.

"మీరు వాడిని చిత్రవధ చేశారు. నానా హింసా పెట్టి చంపేశారు. ఈ భీభత్సం భరించలేక వాడు ఏ నుయ్యో గొయ్యో చూసుకున్నాడు. ఇంతవరకూ యింటికి రాలేదు. వాడిని పొట్టన పెట్టుకున్నారు బాబోయ్. నిష్కారణంగా చంపేశారు".

రాఘవకు మతి పోయినట్లయింది. గబగబ వెదకటానికి వెళ్ళాడు. వాడి స్నేహితులందరి యిళ్ళకూ వెళ్ళాడు. సందులూ గొందులన్నీ గాలించాడు. పిచ్చెత్తిన వాడిలా తిరిగాడు. ఎక్కడా కనబడలేదు.

తల బాదుకుంటూ యింటికొచ్చి ఏడుపులూ. పెడబొబ్బలూ సాగించాడు.

రెండు రోజులయినా కొడుకు జాడలేదు. ఇంట్లో అతని దుఃఖంతోబాటు భార్య విజృంభణ తట్టుకోవడం కష్టంగా వుంది.

విషయం తెలిసి మూర్తి అతన్ని చూడటానికి వెళ్ళాడు. రాఘవ నేలమీదపడి రాగాలు తీస్తున్నాడు. మూర్తిని చూసి అతన్ని పట్టుకుని ఏడ్చాడు.

"వాడెక్కడ వున్నాడో. ఏం తిప్పలు పడుతున్నాడో మూర్తీ. ఒక పావుగంట లేటయితే ఆకలికి వుండలేకపోయేవాడు. జేబులో చిల్లిగవ్వ లేకుండా వెళ్ళాడు. ఏం తింటున్నాడో. ఏమో. దుప్పటి కప్పుకోకుండా వాడికి పడుకోవటం అలవాటు లేదు. ఏ కటిక నేలమీద ఎట్లా పడుకున్నాడో...."

మూర్తి తనకు చేతనైన భాషలో అతన్ని ఓదార్చాడు. ఇంకా రెండురోజులు చూసి, యిహ వుండలేక రాఘవ దిన పత్రికలన్నిటిలోనూ ప్రకటన వేయించాడు.

"బాబూ రామం!

నువ్వు వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ మీ అమ్మా. నేనూ అన్నం, నీళ్ళూ లేకుండా దిగులుతో కుమిలిపోతున్నాం. ముఖ్యంగా మీ అమ్మ దుఃఖంతో మంచాన పడింది. నువ్వు ఎక్కడవున్నా వెంటనే తిరిగిరా. నిన్ను ఏమీ అనము. ఇహముందు కూడా ఏమి అనము, వెంటనే యింటికిరా.

ఇట్లు


నీ రాకకె ఎదురుచూసే నీ తల్లిదండ్రులు.

మూడోనాటికల్లా రామం వూడిపడ్డాడు.

రాగానే రాఘవ వాడ్ని వాటేసుకుని బావురుమని ఏడ్చాడు. ఈ ప్రపంచాన్ని శాపనార్థాలు పెడుతూ తల్లి అతన్ని దగ్గరకు తీసుకుని మరి కదలనియ్యలేదు. వాళ్ళిద్దరి మధ్య ఓ వీరుడిలా, హీరోలా పోజు పెడుతూ కుర్రాడు నిలబడ్డాడు.

కొడుకు తిరిగి వచ్చాడని చాటంత ముఖంతో చెప్పటానికి వచ్చినప్పుడు మూర్తి అతని ముఖంలోకి రెండు నిమిషాలపాటు పరీక్షగా చూసి తన సంతోషం కూడా ప్రకటించాడు. ఏమీ వ్యాఖ్యానం చెయ్యలేదు.

అతనికి తెలుసు కొడుకు ఎక్కడ దొరికిపోయాడో, ఆ కుర్రాడికి యింట్లో




ఎలా ఆడింది ఆటా, పాడింది పాటా అవుతుందో.

* * *

రాఘవ, లక్ష్మి మూర్తి యింటికి వచ్చారు. ఇద్దరి ముఖాలూ కళకళలాడుతున్నాయి. లక్ష్మి చేతిలో వెండి కుంకుమ బరిణ వుంది.

"రండి. రండి" అంది వసంత సాదరంగా.

ఆదివారం కావటంవల్ల ఆ సమయానికి మూర్తి యింట్లోనే వున్నాడు. "ఏమిటి విశేషం?" అన్నాడు వాళ్ళ వాలకం చూసి సోఫాల్లో కూర్చున్నాక.

"మా అమ్మాయి పుష్పవతిఅయింది." అన్నాడు రాఘవ. ఈ మాటలు ముందుగా లక్ష్మి అనలేదు. అతని నోట్లోంచే వచ్చాయి.

మూర్తి. వసంత ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.

"రేపు పేరంటం. భోజనాలు. మీ యిద్దరూ తప్పకుండా రావాలి." అంటూ లక్ష్మి ఆమెకు బొట్టు పెట్టింది.

మూర్తికి తమాయించుకుందామన్నా ఒక్కోసారి నోరు వూరుకోదు. "ఇది చాలా ప్రకృతి సహజమైన విషయం. దీనికి పేరంటం, భోజనాలు ఈ ఆర్భాటమంతా దేనికి? అసలు యిలాంటి విషయాలపట్ల నా అభ్యంతరం చాలావుంది ...." అని యింకేదో అనబోతున్నాడు.

వసంత కళ్ళతో వారించింది.

అప్పటికే లక్ష్మి ముఖం ఎరుపు చేసుకుంది.

"వస్తావుకదూ. తప్పక" అన్నాడు రాఘవ.

"రేపు నీ ఆఫీసు".

"సెలవు పెట్టాను".

ఇంతలో అక్కడికి మూర్తి కొడుకు– పన్నెండేళ్ళవాడు వచ్చి "అమ్మా!" అని ఏదో చెప్పబోతున్నాడు.

మూర్తి "యిప్పుడు కాదుబాబూ. వెళ్ళి ఆడుకో. యింటికి గెస్ట్స్ వచ్చినప్పుడు అలా డిస్టర్బ్ చెయ్యకూడదు" అన్నాడు.


ఆ కుర్రాడు తల ఊపి అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

లక్ష్మి ఆ యింటి శుభ్రతనూ. వస్తువులు తీర్చిదిద్దినట్లు అమర్చిన తీరునూ మార్చి మార్చి చూస్తోంది. మనసులో ఏ మూలో బాధ కలిగింది. మళ్ళీ నిర్దాక్షిణ్యంగా ఆ బాధను అణిచి పెట్టేస్తోంది.

కాఫీలు అయాక "యిహ వస్తాం, యింకా చాలా యిళ్ళు పిలవాలి" అంటూ లేచారు.

"పేరంటానికీ, భోజనానికీ తప్పకుండా రావాలి. లేకపోతే మీతో మాట్లాడ్డను సుమండీ" అంది లక్ష్మి.

"మీరు దానికీ, దీనికీ ముడిపెట్టకండి. ఇలాంటివాటికి ఎప్పుడయినా రాకపోతే,




రాకపోవటానికి అనేక కారణాలుంటాయి. వాటిని అర్థం చేసుకోగల ఓర్పు వుండాలి...." అని మూర్తి యింకేదో అనబోతున్నాడు.

వసంత అతన్ని మళ్ళీ కళ్ళతో వారించింది.

వాళ్ళు వెళ్ళిపోయాక "అబ్బ! మీకు నోరు క్షణంవూరుకో దేమండి" వాళ్ళ అలవాట్లకొద్దీ, సంప్రదాయంకొద్దీ పిలవటానికి వచ్చారు. సరే అనేసే పోయె. వాదనలు దేనికి?" అంది భర్తను మందలిసూ.

"నేను అనుకున్నది బయటకు చెప్ప వదా?"

"కొన్ని విషయాలు బయటకుచెప్పటం వల్ల అపార్థాలూ, అనర్థకాలే ఎక్కువవు తాయి. ఆ మాత్రం తెలియదు మీకు? పెద ఎడిటర్‌నని చెప్పుకుంటారు.

"అంతేనంటావా?" అన్నాడు చిలిపిగా.

ఆమె అతని కళ్ళలోకి చూసింది. "వేళాకోళం చేస్తున్నారా?"

"అంతేనంటావా?"

"ఛీ మీతో మాట్లాడకూడదు పోండి. అని వెక్కిరించి లోపలకు వెళ్ళిపోయింది.

* * *

వయసులు పైబడుతున్నాయి.

"అబ్బ! ఎన్ని బాధ్యతలు. ఎన్ని బరువులు" అని రాఘవ ఆశ్చర్యపోతున్నాడు.

పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. వాళ్ళ చదువులు, పరీక్షలు, పై చదువులు. పెట్లు....

పరీక్షలొస్తే. వాళ్ళతోబాటు రాత్రంతా మెలకువగా వుండేవాడు. వాళ్ళతో టీలు త్రాగించి దగ్గరుండి చదివించేవాడు. ఎగ్జామినేషన్ హాలుదాకా వాళ్ళను తీసుకెళ్ళి దింపి వచ్చేవాడు, బాగా రాస్తే ఎగిరి గంతేసేవాడు. బాగా రాయకపోతే బాధతో మెలికలు తిరిగిపోయేవాడు.

అతనితోపాటు చేరినవాళ్ళంతా డిప్యూటీ తాసిల్దార్లయిపోయారు. అతనింకా గుమాస్తాగానే వుండిపోయాడు.

ఎప్పుడూ సమస్యలు. సెలవు పెట్టటం, పై ఆఫీసరుకు ఎప్పుడూ సదభిప్రాయం వుండదు.

అనంతమూర్తి చీఫ్ ఎడిటరయ్యాడు. వారం వారం లక్ష కాపీలమీద అతనిపేరు ఎడిటర్, అనంతమూర్తి అని అచ్చవుతోంది.

ఇంట్లో ఫోను, కారు ఆఫీసువాళ్ళు అతనికి అన్ని సౌకర్యాలూ అమర్చారు.

ఓ రోజు మూర్తి స్నేహితుడికి కబురు చేశాడు "కళామందిర్‌లో ఈ సాయంత్రం గొప్ప ఫ్లూట్ కచేరీ వుంది. రవిబాబు-పేరు వినేవుంటావు. చిన్న వయసులోనే ఫ్లూట్ వాద్యంలో చాలా ప్రఖ్యాతి సంపాదించి విదేశాలుకూడా పర్యటించి వచ్చాడు. నీకు చిన్నప్పట్నుంచీ ఫ్లూట్ అంటే చాలా యిష్టంకదా. అందుకని ప్యాసుల్ని పంపుతున్నాను. తప్పకుండా యింటో అందర్నీ తీసుకురా."

రాఘవకు వెళ్ళాలని ఎంతో కుతూహలం కలిగింది. రవిబాబు పేరు పేపర్లలో చూస్తూనే వున్నాడు. అతని ఖ్యాతిని గురించి వింటూనే వున్నాడు. భార్యాపిల్లలూ కూడా మేం వస్తామని బయల్దేరారు.

అందరూ రోడ్డుమీద నడుస్తున్నారు.

ఎందుకో మధ్యలో ఆమెవంక చూశాడు. లక్ష్మికి ఒళ్ళు బాగా వచ్చింది. చేతులు దండల దగ్గర లావుగా, గుండ్రంగా వున్నాయి. పొత్తికడుపు బాగా పెరిగింది. నడుస్తోంటే ఆయాసపడుతోంది.

"డయటింగ్ చేస్తే బాగుండును. చెబితే వినదు" అని మనసులో బాధపడ్డాడు.

వెళ్ళేసరికి హాల్లో జనమంతా చాలా వరకూ నిండిపోయి వున్నారు. ముందు పీట్లు ఖాళీలేవు. మధ్యలో ఎక్కడో కూర్చోవలసి వచ్చింది. అనంతమూర్తి ముందు వరసలో ఎక్కడో కూర్చుని వుంటాడు. కనబడలేదు.

రవిబాబు వాద్య కచేరీ మొదలయింది.

రాఘవ ఎంతో ఆసక్తిగా అతనివంకే చూస్తున్నాడు. ఇంచుమించు తనఈడే వుంటుంది కావి. ఆరోగ్యంగా, నిండుగా, గిరజాల జుట్టు. నునుపైన చెంపలు.... చురుగ్గా మెరిసే పెద్దపెద్ద కళ్ళు... ఎంత చిన్నవాడిలా కనబడుతున్నాడు. మురళి అతని పెదవులనుంచి అమృత రాగాలు వర్షిస్తోంది. ఆ ధ్వని తరంగాలు వాతావరణమంతా సమ్మోహనాస్త్రంలా ప్రాకి శ్రోతల్ని ముగ్ధుల్ని చేస్తున్నాయి. జనం చలించిపోతున్నారు. ఆహా ఆహా అంటున్నారు. ఆనందాతిరేకంతో చప్పట్లు కొడుతున్నారు.

రాఘవకు తన బాల్యం గుర్తువస్తోంది. సముద్రతీరం గుర్తువస్తోంది. ఏవేవో సంఘటనలు గుర్తొస్తున్నాయి. పీత గుర్తొస్తోంది.

కళ్ళు చెమరుస్తున్నాయి.

రెండున్నర గంటలు ఎలా గడిచిపోయాయో ఎవరికీ తెలీదు.

కచేరీ ముగిసింది.

తన్మయావస్థలో, మధురానుభూతిలో మునిగిపోయివున్న మనుషులకు ఏదో లోకంనుంచి యివతలకు వచ్చినట్లయింది.

సంగీత సభను నిర్వహించిన వారిలో

కాస్సేపయ్యాక మరెవరో వేదికమీదకి వచ్చి యిప్పుడు రవిబాబుగారికి సన్మానం జరుగుతుందనీ, సన్మాన సభకు ప్రఖ్యాత సంపాదకులు అనంతమూర్తిగారు అధ్యక్షత వహిస్తారనీ చెప్పి అనంతమూర్తిని పైకి ఆహ్వానించాడు.

అనంతమూర్తి, రవిబాబు ప్రక్క ప్రక్కన కూర్చుంటే చూసేవారికి ఇద్దరూ ఎవరి రంగాలలో వారు సమ ఉజ్జీలుగా, ఒకరికి ఒకరు తీసిపోనట్లుగా కనబడుతున్నారు.

అనంతమూర్తి క్లుప్తంగా, శక్తివంతంగా, శ్రోతల గుండెల్లోకి ప్రతి మాట జొరబడేటట్లుగా మాట్లాడాడు. తర్వాత చకచక సన్మాన కార్యక్రమం ముగిసింది. ఆ తర్వాత రవిబాబు ఉపన్యాసం.

అతను లేచి నిలబడ్డాడు.

ఆసక్తికరమైన ఎన్నో విషయాలు చెప్పాడు.

"జీవితంలో ప్రతి కళాకారుడికీ ఎంతో కొంత ప్రతిభ వున్నా ఆ ప్రతిభ సర్వతోముఖంగా వికసించటానికి ఎక్కడ్నుంచో ఓ ప్రభావం కావాలి. అది లేకపోతే అడ్డాలన్నింటినీ ఛేదించుకుంటూ పైపైకి వెళ్ళిపోవటం కష్టం. నేను మొదట నాకు నేను అర్థంగాకుండా ఈ కళ విషయంలో తికమకగా వుండేవాడ్ని. ఎన్నోసార్లు అనేక కారణాలవల్ల దీన్ని వదిలేసి దూరంగా వుండిపోవాలనీ వుండేది. ఆ సమయంలో నా భార్య నన్ను ఉత్తేజపరిచింది. నాలో నిద్రాణమై వున్న శక్తులన్నీ ప్రదర్శనం చేసుకునేటట్లు చేసింది. ఈనాడు ఈ రంగంలో ఇలాంటి ప్రత్యేకమైన స్థానంలో నేనుండటానికి కారణం ఆమే. ఆమే లేకపోతే మీరంతా అభినందించే వేణు విద్వాంసుడు పద్మశ్రీ రవిబాబు లేడు."

హాలంతా కరతాళ ధ్వనులతో నిండిపోయింది.

అనంతమూర్తి లేచి మిసెస్ రవిబాబు ఈ సభలోనే వున్నారనీ, ఆమె వేదిక మీదకు రావాలనీ ఆహ్వానించారు.


ఓ స్త్రీ మూర్తి స్టేజి మీదకు అవతరించింది.

రాఘవ త్రుళ్ళిపడ్డాడు! అతని శరీరం అణువణువునా వణికిపోయినట్లైంది.

ఆమె హుందాగా, ఎంతో అందంగా, చూపరుల్ని ప్రభావితంచేసే చిరునవ్వుతో మెరిసిపోయే కళ్ళతో. అధునాతనంగా, అయినా ఏమాత్రం ఎబ్బెట్టులేకుండా ఆ అధునాతనత్వం సహజంగా అమరిపోయినట్టుగా, తనే ఓ కళాకారిణి అయినట్టు, ఓ చిన్న రాజ్యాన్ని పరిపాలించే మహారాణి అయినట్టు వున్నది.

కానీ, ఆమె సీత

ఏదో మాట్లాడుతోంది. రాఘవకు వినబడటంలేదు. అతని కళ్ళలో. కళ్ళవెనక ఏవేవో దృశ్యాలు. మనసు మూలుగుతోంది. రోగగ్రస్తమైనట్లు మూల్గుతోంది.




అక్కడ వుండలేకపోతున్నాడు

"పోదాం" అని పిచ్చిగా అంటూ లేచి నిలబడ్డాడు.

లక్ష్మి అతని వంక ఆశ్చర్యంగా చూసింది "అదేమిటండీ? ఆవిడంత బాగా మాట్లాడుతోంటే -? కూర్చోండి" అని కసిరింది.

తర్వాత సభ ముగిసేవరకూ, జనంలోంచి బయలుపడి యింటికి చేరేవరకూ ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.

మరునాడు లక్ష్మి "ఏమిటండీ? రాత్రి నిద్రల్లో కంది పచ్చడి. కంది పచ్చడి అని కలవరిస్తున్నారు" అనడిగింది.

అతను తెల్లమొహం వేశాడు. "కలవరించానా? ఏమీ తెలీదు" అని గొణిగాడు.

* * *

మూడే రోజులు. పాత జ్ఞాపకాలన్నీ నిర్దాక్షిణ్యంగా అణచివెయ్యబడ్డాయి. మళ్ళీ భార్య. మళ్ళీ పిల్లలు. మళ్ళీ ఊపిరాడనంత బంధనలు. మళ్ళీ రాఘవ మామూలు మనిషైపోయాడు.


* * *

తాసిల్దారుగారు మూర్తికి ఫోన్ చేశారు.

"మీతో ఓ ముఖ్య విషయం చెప్పాలండీ" అన్నారాయన.

"చెప్పండి" అన్నాడు మూర్తి.

"మా ఆఫీసులో పని చేసే రాఘవరావు అనే అతను, మీరు చిన్నప్పట్నుంచీ ప్రాణస్నేహితులని విన్నాను. అతన్ని గురించి మీతో కొంచెం మాట్లాడాలి. నిజానికి ఎంతో పైకి రావలసినవాడు. నిజాయితీపరుడు. ఆఫీసుకు వచ్చాడంటే గొడ్డులా పని చేస్తాడు. కాని ఎవరికీ అతనంటే సదభిప్రాయం లేదు. మీకో విషయం చెప్పమంటారా? నేనతని కంటే ఒకటి రెండేళ్ళు జూనియర్ని. నేను తాసిల్దార్ నయాను. అతనింకా గుమాస్తాగానే వున్నాడు. ఎప్పుడూ సక్రమంగా ఆఫీసుకు రాడు. అతను పెట్టే సెలవులకు అంతూ పొంతూ లేదు. పిల్లాడికి జ్వరం వచ్చిందంటే ఆఫీసు మానేస్తాడు. పెళ్ళానికి కాలు బెణికిందంటే మానేస్తాడు. పెళ్ళాం తరఫు ఎవరయినా చుట్టం చచ్చిపోతే వారం రోజులు రాడు. తదినానికి అందరకూ ఒక రోజయితే ఇతనికి రెండురోజులు సెలవు. చెప్పి చెప్పి నా ప్రాణం విసిగిపోయింది. పై అధికార్లుకూడా ఎవరూ ఇతని ప్రవ




ర్తన చెక్ చెయ్యటంలేదు. హఠాత్తుగా సస్పెన్షన్ ఆర్డరో, డిస్మిసల్ ఆర్డరో వచ్చినా ఆశ్చర్యంలేదు. మీరతనికి ప్రాణ స్నేహితులని తెలిసి మీకు చెప్పాను."

మూర్తి మనస్సంతా బరువుతో నిండిపోయింది. రాఘవను తరుచు కలుసుకోకపోవచ్చుగాని అతనంటే అవ్యాజమైన అనురాగం వుంది. అతని జీవితాన్ని ప్రతి అంశాన్ని పలకరిస్తూనే వున్నారు. అయితే చాలా సందర్భాలలో ప్రేక్షకులుగా వుండటంకన్న. ఏమీ చెయ్యలేం.

ఫోన్ వచ్చిన సమయానికి మూర్తి తమ వారపత్రిక కోసమని వ్రాస్తోన్న సీరియల్ నవలలోని ఓ అధ్యాయం పూర్తి చేస్తున్నాడు, ఈ మధ్య అతను నవలరాసి చాలా రోజులయింది. పత్రిక నిర్వహణలో రచనా వ్యాసంగం కొనసాగటం లేదు. అయితే అది తాత్కాలికమే. జీవితంలో ఒక అంశం గురించి మరో అంశాన్ని త్యాగం చెయ్యటం అతని కెప్పుడూ అలవాటు లేదు. తను చీఫ్ ఎడిటరయాక అసిస్టెంట్ ఎడిటర్‌గా సబ్ ఎడిటర్లలోంచి ఒక సమర్థుడైన యువకుడ్ని తీసుకున్నారు. తన పర్యవేక్షణలో పత్రిక నిర్వహణా బాధ్యత ఎక్కువగా అతనికి అప్పచెబుతూ వచ్చాడు.

చాలా కాలం తర్వాత అతని కలంనుంచి వెలువడుతోన్న నవల పాఠక లోకంలో గొప్ప సంచలనాన్ని రేపింది. మూర్తి నిజాన్ని ప్రేమిస్తాడు. జీవితంలో ఎన్నో కల్పన లుంటాయి. భ్రమలుంటాయి. అవి వేకాన్ని తొలగించుకుని యదార్థాన్ని చూడగలగటం అంత తేలికైన పనికాదు.

అతన్లో చుట్టూ పరిభ్రమించే అనేక సమస్యల్ని చూస్తోంటే కలవరపాటు కలుగుతుంది. మన చుట్టూ వున్న సంతోషాలన్నీ నిజమైన సంతోషాలా? సంవత్సరాల తరబడి అన్యోన్యంగానే కనబడుతూ, నిజంగానే అన్యోన్యంగానే గడిచిన సంసారాల్లో భార్యా భర్తలు ఒకర్నొకరు దారుణంగా కొన్ని వందల సార్లయినా మోసం చేసుకుని వుండరా? వారి ప్రేమ నిజమైనది కావచ్చు. వివాహ బంధంలోని మైకం నిజమైనది కావచ్చు. వారిద్దరి మధ్య జరిగే మోసంకూడా అంతేనిజం...ప్రాణ స్నేహితుల మధ్య కూడా పొరలెందు కుంటాయి. ఒకర్నొకరు ఎంతో హర్షించు కుంటున్నా మనసుల్లో గర్హించుకునే సందర్భాలెందుకుంటాయి? శ్రామికుడికంటే కూడా ఎక్కువగా కష్టపడి, దానికి తెలివితేటలు జోడించి కర్మంకాలి నాలుగు డబ్బులు సంపాదించుకుంటే అతను బూర్జువానా, సంపాదించే నాలుగు రూపాయల్లో మూడు రూపాయలు చిత్తుగా తాగేసి మిగతా రూపాయి కూడా పెళ్ళాన్ని కొడుతూ తంతూ యిచ్చే జీవి అభాగ్యుడా? ఒక మనిషి యింకో మనిషికి విలువయిస్తున్నాడా? ఒక మనిషిలోని శక్తిసంపదలు యింకో మనిషి గుర్తించి ఒప్పుకోగలుగుతున్నాడా? మంచి మనిషినే అందరూ స్వార్థానికి వాడుకుందామని చూస్తారెందుకు? భార్యా భర్తలు ప్రేమ ప్రేమ అని బాజాలు వాయించుకుంటారు. భర్త సంపాదనపోయి నెలలతరబడి యింట్లో కూర్చుని అప్రయోజకుడయితే భార్య ఆ ప్రేమ నిలబెట్టుకుంటుందా? నిజమైన మానవతావాది అసలు గుర్తించబడుతున్నాడా? పెళ్ళాం, పిల్లలు, చుట్టాలు, స్నేహితులు. ఆఖరికి తల్లీ తండ్రీకూడా అలాంటివాడిని అపార్థం చేసుకుని అపహాస్యం చేయటంలేదా?

ఈ వేదన అన్నిటితో కొన్ని పాత్రలు పూరించుకుని, యితివృత్తాన్ని సమీకరించుకుని అతనీ నవల రాస్తున్నాడు.

తాసిల్దార్‌గారి దగ్గర్నుంచి ఫోన్ వచ్చాక కలం ముందుకు సాగలేదు. ఆ అధ్యాయం అప్పుడు పూర్తిచేయలేదనిపించింది. వెంటనే కనుక్కొని రాఘవ ఆఫీసు కెళ్ళాడు. అతనాఫీసుకు రాలేదని, సెలవు పెట్టాడనీ తెలిసింది వెంటనే యింటికి వెళ్ళాడు.

మూర్తి వచ్చాడని తెలిసి రాఘవ లోపల్నుంచి వచ్చాడు.

"నీకోసం ఆఫీసుకెళ్ళాను. రాలేదని తెలిసి యిక్కడకు వచ్చాను.

"కూర్చో."

ఇద్దరూ కూర్చున్నారు.

"పెదమ్మాయి విమలకు వంట్లో బాగా లేదు. అందుకని సెలవు పెట్టేశాను."

"ఏమిటి సుస్తీ?"


'బ్లీడింగ్ ఓవర్‌గా అవుతోంది. చాలా వీక్‌గా వుంది.'

మూర్తి తను వచ్చిన ప్రసక్తి ఎలా తీసుకువద్దామా అని ఆలోచిస్తున్నాడు.

"ఈ పిల్లల్ని గురించి నాకు మనశ్శాంతి వుండటంలేదనుకో" అన్నాడు రాఘవ.

"అంటే....?"

"పెద్దవాడు రామం కొరకరాని కొయ్యి అయిపోయాడు. చదువులో పైకి రాలేదు. ఇంటికి వేళపట్టున రాడు. ఒక్కోసారి కొన్ని కొన్ని రోజులపాటు అసలు కనిపించడు. ఉద్యోగం చెయ్యరా అంటే వాళ్ళిచ్చే రెండొందలూ మూడొందలూ




తన అవసరాలకు వాడుకుంటాడు. నేనెక్కడ్నించయినా పదివేలు తెచ్చిస్తే దాంతో వ్యాపారం చేసి లక్షలకు లక్షలు గడిస్తానంటాడు. ఇహ రెండోవాడు వాసు-బుద్ధిమంతుడే. ఇంజనీరింగ్ అయాక వాడికి ఉద్యోగం వస్తుందో రాదో అని బెంగపెట్టుకుని చస్తున్నాను అవునూ-నీకిలాంటి బాధలుండవా?"

"నేను మనిషిని కానా?" అన్నాడు మూర్తి.

"మరి ఎప్పుడూ పట్టించుకున్నట్లు కనిపించవేం?"

"ఎందుకు పట్టించుకోను? నీవు నీ పిల్లల్ని ప్రేమించినట్లే నేనూ నాపిల్లల్ని ప్రేమిస్తాను, నువ్వు నీ పిల్లలు పైకి రావాలని కోరుకున్నట్లే నేనూ నా పిల్లలు పైకి రావాలని కోరుకుంటాను. దానికి కావల్సిన వసరులన్నీ ఏర్పాటు చేసుకుంటాను. ఎటొచ్చీ దాన్ని ఇరవై నాలుగు గంటల ధ్యానం చేసుకోను. నా బాధ్యత నేను నెరవేరుస్తానుగాని, ఆ ప్రలోభంలో పడినా అభిరుచుల్ని, ఉద్యోగానికి వినియోగించే కాలాన్నీ. నా ఉనికిని ఈ సంఘంలో సుస్థిరంచేసే అవకాశాల్ని పాడుచేసుకోను. నా సంసారాన్ని ఉద్యోగరీత్యా నా మీద ఆధారపడిన వాళ్ళనూ, వీళ్ళని తీర్చి దిద్దటానికి ప్రయత్నిస్తానే నన్ను నేను పోగొట్టుకోకుండా శ్రమిస్తూ వుంటాను. మనల్ని మనం పోగొట్టుకున్న తరాత ఈ జీవితం, ఈ ప్రేమలు ఈ బంధాలు యివన్నీ వృథా. "నేను" అనేది నిరంతరం నే మరచిపోను."

లోపల్నుంచి విమల కొడుకు బాధతో మూలిగినట్లు వినిపించింది.

"రాఘవ ముఖంలో వ్యాకులపాటు కనిపించింది" కాసేపు అమ్మాయి దగ్గర కూర్చుని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు.

అయిదు నిమిషాలు... పది. పావుగంట. గడిచింది. రాఘవ బయటకు రావటంలేదు. అయినా మూర్తి వెళ్ళిపోకుండా ఓపిగా కూరున్నాడు. చివరకు అరగంట అయినాక అతను బయటకు వచాడు. "అమ్మాయి యిప్పుడే నిద్రపోయింది" అంటూ.

"నేనో విషయం విన్నాను" అన్నాడు మూర్తి.

"నా గురించా?"

"నువ్వు ఉద్యోగం చేసే తీరు తెన్నుల గురించి పై అధికార్లు తృప్తి పడటం లేదనీ, ఉద్యోగం పోయే అవకాశం కూడా వుందనీ..."

రాఘవ ముఖంలో కోపం కనిపించింది. కొంచెం గట్టిగా యించుమించు అరుస్తున్నటు అన్నాడు. "నేనెవరికీ అన్యాయం చెయ్యలేదు. అవినీతిగా ప్రవర్తించలేదు. నా సమస్యలు నాకుంటాయి. అవి పై ఆఫీసర్లకి తెలియదు. నా బాధ్యతలు నాకుంటాయి. అవి వాళ్ళకు తెలీదు. నేనం తప్పు చేయటం లేదు. నా ధర్మం నేను నెరవేరుస్తున్నాను. అది నా విధి నిర్వాహణ అనుకుంటున్నాను. ప్రమోషన్లు యివ్వక పోయారా; పోని ఉద్యోగం తీసేశారా; పోనీ లెక్కచెయ్యను అదంతే."

మూర్తికి అతన్తో మాట్లాడే ప్రయోజనం లేదనిపించింది. బరువుగా అక్కడ్నుంచి కదిలి బయటకు వచ్చేశాడు.

ఆ తర్వాత తాసీల్దార్ని కలుసుకుని-అతని ఉద్యోగం మాత్రం పోగొట్టకుండా చూడమని. చెప్పవలసిన విధంగా చెప్పి ఒప్పించాడు.

* * *

ఒకరోజు రాఘవ మూర్తి ఇంటికి కంగారు కంగారుగా వచ్చాడు. మనిషి కొంచెం వగరుస్తున్నాడు "నీతో అర్జంటుగా మాట్లాడాలి పర్సనల్" అన్నాడు.

"పద పద నా గదిలోకి పోయి కూర్చుందాం. అక్కడికెవరూ రారు" అని పైకి తీసుకువెళ్ళాడు.

ఆ గదిలో ఎక్కడచూసినా అక్కడ అరమరికలోటు రాకుండానే పుస్తకాలు, రాజకీయాలు, . . . జర్నలిజం, ఇంగ్లీషు, తెలుగు అది అతని సామ్రాజ్యంలా గోచరించింది.

'నువ్వు పిల్లలు పెంపకం. అందులో నియమాలూ అంటూ ఏవేవో కబుర్లు చెబుతావు. అవతల కొంపలంటుకుపోతున్నా కూడా చూస్తూ ఊరుకుంటావా?

"ఏం జరిగింది?"

"మీ అబ్బాయి మోహన్ ఎవరో క్రిస్టియన్ పిల్లతో తిరుగుతూ కనిపించాడు. వాళ్ళిద్దరూ ఎంత క్లోజ్‌గా వున్నారంటే ప్రేమ మైకంలో పడినట్టూ, బహుశా పెళ్ళి చేసుకునేటట్టూ కనిపించారు."

అనంతమూర్తి ఏమీ మాటాడలేదు.

"మాట్లాడవేం? యిప్పుడుకూడా చీమ కుట్టినట్లుగా లేదా?"

"చీమ కుట్టినట్లుగానే వుంది. కాని కుట్టింది పాములు కావు"

"అంటే...?"

"ఆ వయసులో నేనెలా ప్రవర్తించానా అని గుర్తుచేసుకుంటున్నాను. రాఘవా; ఓ ప్రశ్న అడుగుతాను. ఎందు

కంటే నువ్వు నా కెప్పుడూ చెప్పలేదు. వయసులో వున్నప్పుడు ఏ అమ్మాయినీ చూసి వ్యామోహంలో పడలేదా?

రాఘవ అయోమయంగా చూశాడు. "నాకు తెలీదు."

"ఈ సృష్టిలో ప్రేమ, వ్యామోహం యివన్నీ ఎంత సహజమంటే తల్లిదండ్రులు కాదుకదా సమాజం కాదుగదా. సాంఘిక ధర్మాలు కాదుగదా - ఏవీ వీటిని అరికట్టలేవు చరిత్ర చూడు, పౌరాణిక గాథలు చూడు కోకొల్లలుగా యిలాంటి వుదంతాలతోనే నిండివున్నాయి."

"అందుకని నువ్వు మద్దతు యిస్తున్నావా?"

"మద్దతు యివ్వటంలేదు నిజాన్ని స్వీకరిస్తున్నాను."

"ఈ కుర్రకారు చేష్టలను యిలాగే ఉపేక్ష్యంచేసే మన సంప్రదాయం, ప్రతిష్ఠ. ఆఖరికి దేశం అన్నీ మట్టిగొట్టుకు పోతాయి."

"ఏ దేశమైనా ఈ సమస్యను అరికట గలుగుతుందని నేననుకోవటంలేదు. చాలా దేశాల్లో మనం వులిక్కిపడి దడుచుకునేటంతటి స్థాయిలో కూడా వుంది. అయినా ఆ దేశాలు మట్టిగొట్టుకుపోలేదు. అనేక రంగాలలో మనకంటే ముందడుగు వేస్తూ పురోగమిస్తూనే వున్నాయి."

"అయితే మీ అమ్మాయి గురించి పట్టించుకోకుండా మానేస్తానంటావా?"

"పట్టించుకోకుండా మానెయ్యను, ఏదో పరిష్కారం ఆలోచిస్తాను."

"ఎలా ఆలోచిస్తావు?"

"ప్రేమలో పడ్డవాళ్ళ మీద నాకు జాలే కాని, కోపం వుండదు. ప్రేమించుకున్న వాళ్లు ఎక్కువగా కష్టాలు పడుతూ మానసిక క్షోభననుభవిస్తూ తక్కువ సుఖపడుతూ వుంటారు. వీటి పర్యవసానాలు ఓ స్నేహితుడిలా వాడికి వివరిస్తాను"

"కొడుకుతో ఇవన్నీ విపులీకరిస్తావా?"

"తప్పేం? ఓ మంచి స్నేహితుడిగా ఇవ్వవలసిన సలహానిస్తాను?"

కాసేపుండి రాఘవ వెళ్ళిపోయాడు.

మూర్తి ఎనిమిది గంటలదాకా చదువుతోన్న పుస్తకాన్ని పూర్తిచేసి క్రిందకు దిగివచ్చేసరికి ఇంట్లో అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర భోజనాలకు చేరుతున్నారు.

మూర్తి వెళ్ళి భోజనానికి కూర్చున్నాడు,

"అమ్మ రేపు అన్నవరం వెడతానంటున్నది నాన్నా. ఎప్పుడో వెడతానని అనుకుందట" అంది పెద్ద కూతురు వందన.




"అలాగే వెళ్ళిరండి."

"నువ్వెప్పుడూ గుడికి రావేం నాన్నా? నువ్వు నాస్తికుడివా?"

మూర్తి ఏమీ జవాబు చెప్పలేదు, చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"రేపు నువ్వు కూడా రా నాన్నా, అందరం కలిసి వెడదాం."

"ఇప్పుడు కాదమ్మా! నేను అన్నవరం వచ్చి సత్యన్నారాయణ వ్రతం చేయిస్తానని ఒకందుకు మొక్కుకున్నాను. నా కోరిక నెరవేరాక అప్పుడు వెడతాను. కావాలంటే మీరంతా నాతో రండి?

తల్లీ, కొడుకు, ఇద్దరు కూతుళ్ళు అతని వంక నమ్మలేనట్లు ఆశ్చర్యంగా చూశారు.

"నువ్వు.... దేముడికి మొక్కుకున్నావా?" వందన కళ్ళు పెద్దవి చేసి అంది.

"అవునమ్మా. మీ ముగ్గురూ అంటే, మీ యిద్దరు అక్కాచెల్లెళ్ళూ వైర్ బ్యాగ్‌లు అల్లటం ఎప్పుడు మానేస్తారో, అప్పుడు వచ్చి వ్రతం చేయిస్తానని మొక్కుకున్నాను. ఏం చెయ్యను? నా బాధ ఎవరికీ చెప్పుకోలేక దేముడికి చెప్పుకున్నాను."

ఒక్క నిమిషం మౌనంగా వుండి, అంతా ఒక్కసారిగా గట్టిగా నవ్వేశారు.

"పో నాన్నా! మమ్మల్ని వెక్కి-

అలహాబాదు హైకోర్టులో, మోతీలాల్ నెహ్రూ ఒక సాక్షిని క్రాసుపరీక్ష చేస్తూ ఉండగా, ఆ సాక్షి ఉద్రేకపడి "నేనేం మూర్ఖుణ్ణనుకున్నారా?" అన్నాడు. మోతీలాల్ కొంటెగా నవ్వుతూ, "అబ్బే! నేనలా ఎంతమాత్రం అనుకోలేదు. కాని, నేను పొరబడి ఉండవచ్చుగదా!" అని సాగదీశాడు.

రిస్తావు" అంది కుమారి.

"వెక్కిరించటం కాదమ్మా. మీరు ఏ పనీ కొన్ని నెలలపాటు దీక్షగా చెయ్యరు. చిన్నపిల్లలు కొంతకాలం గోలీకాయలనీ, కొంతకాలం బొంగరాలనీ, కొంతకాలం గాలిపటాలనీ సీజన్ వారీగా ఆడుకుంటూ వుంటారు. అలాగే మీరు కొన్ని రోజులు పూసలతో బొమ్మలు చెయ్యటం, కొన్ని రోజులు గుడ్డబొమ్మలు ప్రస్తుతం సీజన్ వైర్‌తో బ్యాగ్‌లు అల్లటం ... వ్లూ అలుముకున్నట్లు ఏ యింట్లో చూసినా ఈ వైర్ బ్యాగ్‌లే. కొన్ని నెలలు పోయాక మళ్ళీ యివన్నీ ఏ మూలకి పోతాయో అజాపజా వుండదు."

"నువ్వు కుట్టుమిషన్ల గురించి చెప్పటం మరిచిపోయావు నాన్నా?" అన్నాడు మోహన్.

"కుట్టు మిషన్లేమిటి?"

"కత్తిరింపులు నేర్చుకోవటం, మిషన్ కొనేసి నాలుగురోజులు టక టక చప్పుడు చేసేయ్యటం, కాగితాలూ, గుడ్డలూ కత్తిరించి యిల్లంతా పోగులు పెట్టటం, ఎక్కడ చూసినా యిదే కనిపిసుంది నాన్నా మళ్ళీ జాకెట్ కుట్టించుకోవాలంటే బయటి టైలర్‌నే పిలిచి యిస్తూంటారు. మిషన్ మాత్రం భద్రంగా మూలపడి వుంటుంది."

వసంత కొడుకువంక కోపంగా చూసింది.

"అన్నట్లు యింకొకటుంది నాన్నా."

"ఏమిటి మా మీద రీసెర్చి చేస్తున్నావా?" వందన ఉక్రోషంగా అంది.

"ఆ మధ్య అమ్మ వీణ నేర్చుకున్నది చూశావా? ఆ టింగ్ టింగ్‌లతో యిల్లంతా మారోగిపోయింది. ఇప్పుడు వీణ ఎక్కడుందో తడుముకోకుండా చెప్పమను. వంద రూపాయలు పందెం!"

"చాల్లే ఇహ ఆపు" కుమారి కోపంగా అన్నది.

"ఒక విషయం చెప్పనా?" అన్నాడు మూర్తి.

అంతా అతని వంక చూశారు.

"తనది కాని జీవితం జీవించడానికి చాలామంది తహతహపడతారు. కొన్నాళ్ళయాక వంటికి యిమడక దాన్నుంచి విముక్తి పొందటానికి తాపత్రయపడతారు. ఇది ఈనాటి నాగరికత?"

ఎవరికీ ఎదురు చెప్పటానికి పాయింటు దొరకలేదు.

భోజనాలయాక "మోహన్ ఒకసారి పైకిరా" అనిచెప్పి పైకి వెళ్ళిపోయాడు.


అయిదు నిమిషాలు గడిచాక "ఏమిటి నాన్నా?" అంటూ మోహన్ తండ్రి దగ్గరకు వెళ్ళాడు.


అనంతమూర్తి ఈజీ ఛైర్‌లో వెనక్కివాలి కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్నాడు.

"కూర్చో."

మోహన్ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. ఎవ్వరూ లేరు. ఎందుకో కొంచెం భయమనిపించింది.

"నువ్వు ఎవరో అమ్మాయితో తిరుగుతున్నట్టు తెలిసింది నిజమేనా?"





ఒక్క నిమిషం టైమ్ తీసుకుని "నిజమే నాన్నా" అన్నాడు నెమ్మదిగా.

"ఆ అమ్మాయి ఎవరో, కులమేమిటో, జాతి ఏమిటో నా కనవసరం. ప్రేమించుకున్న వాళ్ళకి, పోనీ ప్రేమించుకుంటున్నామని అనుకునేవాళ్ళకి చాలా ముందు చూపు. వ్యక్తిత్వం వుండాలి. ఒకటి ఆ అమ్మాయి జీవితాన్ని ఏ విధంగానూ పాడు చేసే హక్కు నీకు లేదు. రెండు ప్రేమ పేరుతో సోషల్ లైఫ్‌కి బాయ్‌కాట్ చేయబడినట్లు దూరమై నీ జీవితాన్ని ఇరుకు జీవితం చేసుకునే హక్కు నీకు లేదు. మూడు నీ కాళ్ళమీద నువ్వు నిలబడగలిగే శక్తి వచ్చేవరకూ వ్యవహారం పెళ్ళిదాకా పోనిచ్చే హక్కు నీకు లేదు. ఈ మూడింటిని సాధించే పరిపూర్ణత నీలో వున్ననాడు నువ్వెవర్ని ప్రేమించినా నా కభ్యంతరంలేదు. ఇహ వెళ్ళు."

ఒక్క నిమిషం తండ్రి ముఖంలోకి చూసి మోహన్ అక్కడ్నుంచి లేచి క్రిందకు దిగి వెళ్ళిపోయాడు.

* * *

"అంకుల్."

ఆఫీసులో టేబిల్ ముందు కూర్చుని వ్రాసుకుంటూన్న వాడల్లా తల ఎత్తి చూశాడు.

విమల గుమ్మంలో నిలబడి వుంది.

"రామ్మా" అన్నాడు సాదరంగా.

విమల దగ్గరకొచ్చి నిలబడింది. మనిషి భయంతో, ఆందోళనతో కృంగిపోయినట్లు కనిపిస్తోంది. ముఖంలో వ్యాకులపాటు.

"కూర్చో అమ్మా."

ఎదురుగుండా కూర్చుందిగాని తల ఎత్తటంలేదు.

"కాఫీ త్రాగుతావా?"

"వద్దు అంకుల్."

"చెప్పమ్మా. ఏమిటి సంగతి?"

విమల తల ఎత్తి అనంతమూర్తి ముఖంలోకి చూసింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"నేను.... నేను.... తప్పు చేశాను అంకుల్."

"ఈ సృష్టిలో తప్పులు చేయంది ఎవరమ్మా? నేరం చెయ్యటంవేరు. తప్పు చెయ్యటం వేరు. ఏం జరిగిందో చెప్పమ్మా."

"మా ఆఫీసులో పనిచేసే పాషా అనే అబ్బాయితో క్లోజ్‌గా వున్నాను. ఒకర్ని ఒకరు లైక్ చేశాం.... కాని.... కాలు జారాను అంకుల్. ఇప్పుడు...ఇదయింది... వొట్టి మనిషినికూడా కాదు."

అనంతమూర్తి ప్యాకెట్‌లోంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

"ఏం చెయ్యాలో చెప్పు అంకుల్?"

"ఇంట్లో తెలిసిందా?"

"ఇంతవరకూ తెలియదు. నాన్న బాధపడిపోతారు, అమ్మ చంపేసుంది."

"మరి ఇదంతా జరుగుతుందని తెలిసి ఎందుకలా చేశావు?"

విమల తలయెత్తి అతని కళ్ళలోకి చూసింది.

"కొన్ని సందర్భాలలో... అలా చేయకుండా వుండగలగటం అసాధ్యమని తెలుసుకున్నాను".

"నాన్నగారితో మాట్లాడతాను."

"నువ్వే ఏం చేస్తావో చెయ్యాలి అంకుల్. నేనేమీ వాళ్ళతో వివరించలేను. నాకా అవకాశం ఇవ్వరు వాళ్ళు. ఏమయినా నేను పాషాని పెళ్ళిచేసుకుని తీరాలి. అది వినా గత్యంతరం లేదు. అర్థమయిందా అంకుల్?"

"అలాగే నమ్మా."

విమల వెళ్ళిపోయాక చాలా సేపు ఆలోచిస్తూ, అలా కిటికీలోంచి చూస్తూ వుండిపోయాడు.

* * *

విషయం విని రాఘవ భూమిలోకి కృంగి పోయినట్లయి పోయాడు.

అప్పటికే ముఖం ముడతలు పడింది. కళ్ళచుట్టూ నల్లని గీతలు ఏర్పడ్డాయి. జుట్టు ముందు భాగమంతా వూడిపోయి, వున్నది కాస్తా తెల్లబడి పోయింది. వెన్ను కాస్త వొంగింది. ఇంకా అతను గుమాస్తానే.

"వీల్లేదు. అలా జరగటానికి వీల్లేదు" అని అరిచాడు.

"జరగక తప్పదు. విమల యిప్పుడు వొట్టి మనిషి కూడాకాదు. రాఘవా-కొంచం నిదానంగా ఆలోచించు. నేను పాషా అనే అతన్ని చూశాను. అతన్తో మాట్లాడాను. ఉద్యోగస్థుడు. ఆఫీసులో కూడా మంచి పేరుంది. నిజాయితీపరుడిలా కనిపించాడు."

"నేను నా కూతుర్ని అన్యమతం వాడికివ్వను."

"నువ్వివ్వద్దు. వాళ్ళిద్దర్నీ పెళ్ళి చేసుకోనియ్యి. పోనీ ఈ పెళ్ళి నేనుచేస్తాను?"

"మూర్తీ, నేను దాన్ని ఎంత ప్రేమగా పెంచానో నీకు తెలీదు. దానికి జబ్బుచేస్తే తల్లడిల్లి పోయాను. ఆఫీసుమాని అహర్నిశలూ దాని మంచం ప్రక్కనే శుశ్రూషలుచేస్తూ, ధైర్యం చెబుతూ గడిపాను. డాక్టర్లు విసుక్కుంటున్నా పదే పదే వాళ్ళ చుట్టూ కుక్కలా తిరిగాను. అది నా కింత అన్యాయం చేస్తుందా?"

"నీకు అన్యాయం చెయ్యాలనే ఉద్దేశంతో ఆమె ఈ పని చెయ్యలేదు. నాగరికతకూ, సంస్కారానికీ లొంగని

సంఘటనలు కొన్ని వుంటాయి. సృష్ట్యాది నుంచి అవి తటస్థిస్తూనే వున్నాయి. మానవజాతి చరిత్రలో ఒక భాగంగా కలిసి పోయాయి."

"వద్దు. నాకు నీ సిద్ధాంతాలు చెప్పకు. దాన్ని వెనకేసుకురాకు .... దాన్ని నేను క్షమించలేను. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు-అదంతే" ఉద్రేకంగా అంటూ, లేచి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

* * *

రాఘవ ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. రాఘవ ఆమెను కసితీరా మనసులోని క్షోభంతా బయటకు క్రక్కేసేటట్టు తిట్టాడు లక్ష్మి అరుస్తు, కేకలు పెడుతూ, చేతులు నొప్పెట్టేవరకూ. ఎవరడ్డు వస్తున్నా ఆగకుండా, కూతుర్ని వళ్ళు హూనంచేసి, తర్వాత ఫిట్ వచ్చి పడిపోయింది. ఇల్లంతా ఏడుపులు. పెడబొబ్బలు, శోకాలు...

ఏమయినాసరే- ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదని-విమలకు స్పష్టం చేశారు.

ఆ రాత్రి విమల నిద్రబిళ్ళలు మ్రింగి పడుకుంది.

తెల్లారి ఆమె ఎంతకూ కదలకపోయే సరికి అనుమానం వొచ్చి చూస్తే వొంటి మీద తెలివిలేని స్థితిలో చావు బ్రతుకుల మధ్య పడివుంది. ఆటోదిటోమంటూ హాస్పటల్‌కి తీసుకెళ్ళి ఎడ్మిట్ చేశారు.

గవర్నమెంట్ హాస్పటలయితే మెడికో లీగల్ కేసవుతుంది. ప్రయివేట్ నర్సింగ్ హోం....

అక్కడి డాక్టరు నమ్మకం చెప్పలేకపోయాడు. ఎందుకంటే మాత్రలు మ్రింగి అప్పటికే చాలా సేపయింది. చాలా డీప్ కోమాలో వుంది. మిగతా చిహ్నాలు కూడా ప్రోత్సాహకరంగా లేవు.

మూడు రోజులు నరకంలా, యజ్ఞంలా గడిచింది. ఎప్పటికప్పుడే పరిస్థితి ఆందోళనకరంగా మారుతూ వుండేది. మళ్ళీ అంతలో కొద్దిగా మెరుగవుతూ ఉండేది.

చివరికి విమల బ్రతికింది కాని కొన్ని రోజుల వరకూ పూర్తిగా తెలివిలోకి రాలేదు. ఊరికే వెక్కి వెక్కి ఏడుస్తూ ఉండేది. ఫిట్‌లా వచ్చి మెలికలు తిరిగి పోయేది.

అనంతమూర్తి, వసంత రోజూ వచ్చి చూసి వెడుతూనే వున్నారు.

విమల పరిస్థితి మెరుగై యింటికి తీసుకు రావటానికి పదిహేను రోజులు పట్టింది.

ఆమెతో ఎవరూ మాట్లాడరు. ఆమె గురించి ఎవరూ పట్టించుకోరు. ఈ పెళ్ళి జరిగితే ఆమెకూ తమకూ సంబంధం తెగిపోయినట్లేనని స్పష్టం చేశారు,

నల దీపావళి ప్రత్యేక సంచిక
ఆంధ్రజ్యోతి పాఠక హృదయ రాగవిపంచిక!


ప్రియమైన గోపీ,

కొమ్మూరి వేణుగోపాలరావుగారి తొలినవల చదివి అత్యున్నతమైన సాహితీ శిఖరాన్ని అధిష్ఠించేడని చెప్పేవాడివి. నీ అభిమాన ప్రచురణ సంస్థ 'నవభారత్' వారు కొమ్మూరి వారి ఎనిమిది నవలలను ఒకేసారి విడుదల చేసేరు. అవన్నీ చదివేను. ఇప్పటికీ మీ కొమ్మూరి తన స్థానాన్ని మరింత భద్రపరచుకుని లక్షలాది పాఠకులకు అభిమాన రచయితగా నిలిచి వుండటం ఎంత అపూర్వమైన విషయం బావా!

మధ్యతరగతి ఉమ్మడి కుటుంబాలను ఆవరించిన అనేకానేక సమస్యల విశ్వరూపాన్ని సమాత్మంగా చెప్పి ఒప్పించిన మహత్తర రచన "ఈ దేశంలో ఒక భాగమిది!" నువ్వు చదివితే ఈ నాటి నవలలో నవలా కిరీటమనితప్పక అంటావు. వెల 7-50.

ఒక జీవిత గణిత సూత్రాన్ని నేనూ చెప్పగలను-బావా!

పసుపు — పవిత్రత లేక శాంతతా!

కుంకుమ — తిరుగుబాటూ లేక రౌద్రమూ! పసుపు+కుంకుమ — మీ కొమ్మూరి వారి కొత్త నవల 'పసుపు కుంకుమ' నవలే వెల : 6.00

ఎంత గొప్ప రచయితో, అంత పరిశీలనగల డక్టరు కావడంవల్లనే మేనరికాలమంచి చెడ్డలను సాధికారంగా చర్చించి ఎందరికో ఉపకరించే మేలైన నవల "ఒకేరక్తం ఒకే మనుషులు" రాసేరు. వెల 6.00.

లలిత సుందర సుకుమార త్యాగధనులైన ప్రేమికుల మధ్య చెప్పుకోలేని భయంకరమైన వ్యాధి-వారి స్వర్గసుఖాలకు అవరోధం కాదుకాదని, నిరూపిస్తూ మహామానవతా దృక్పథంతో రాసిన మహోన్నత నవల "భారతి" వెల : 7.50.

నీ అభిమాన నవల "పెంకుటిల్లు"ని నవలా చిరంజీవి అని అంటూండేవాడివి. ఆ నవల తొమ్మిదో ముద్రణ. మేమంతా చదివేం. నవలా సాహిత్యంలోనే అప్పటి నీ జోస్యానికి ఇప్పుడు మేము జేజేలు చెప్పుకుంటున్నాం. "పెంకుటిల్లు" వెల : 7.50

విశ్వమోహనమైన ఇతివృత్తాలను ఎంచుకోవటంలో మా కొమ్మూరి వారిదేనని పందెంకాసుండేవాడివి. ఎన్నో చదివి చదివి చివరికి "నివేదిత" కూడా చదివి నన్ను ఓడించడం నా తరం కాదనే నిర్ణయానికి వచ్చేను. ఎంత సరికొత్త ఇతివృత్తం బావా! ఈ "నివేదిత" వెల : 7.50.

అప్పుడెప్పుడో "సంకెళ్ళు" నవల నా చేతికిచ్చి పూల సంకెళ్ళని నవ్వుతూ కితకితలు పెట్టేవాడివి. దానికి బదులుగా నీలాంటివారిదిన్న నాటి చిలిపి దొంగతనాల గమ్మత్తు కథ "పిల్లదొంగ" నిచ్చి నీ ఆటలు కట్టించేదాన్ని. ఎంత గమ్మత్తు బావా! మనకోసం ఆ నవల్లం పూల సంకెళ్ళు, ఆ చిన్నారి చిలిపి దొంగతనాలూ రెండు నవలలూ కలిపి "సంకెళ్ళు"గా వెలువడింది. వెల : 6.00

ఒక కథ : తన చిన్నప్పుడు వాళ్ళక్క మరో అపరిచిత వ్యక్తితో సన్నిహితంగా మాట్లాడటం చూసేడతను. ఈ చిన్ని ఉదంతం ఆ ముగ్గుర్నీ జీవితాంతం ఎలా వేధించి వెంటాడిందో సంచలనాత్మక చరిత్రగా మీ కొమ్మూరి వారి కలమే "శారద" నవలలో చెప్పింది. వెల : 6.00

ఇవన్నీ దివ్య దీపావళి దీపాలంకరమ్యంగా సర్వజనాకర్షణీయంగా వెలువడ్డాయి. మొత్తం ఖరీదు 54 రూపాయిలే! కాని, 50 రూపాయలు M. O. చేసిన వారికి పోస్టు ఖర్చులు కూడా భరించి, రిజిష్టరు పోస్టులో పంపుతారు. వి. పి. పి. పద్ధతిలేదు, మీ మిత్రులందరికీ చెప్పు.

మరోమాట....

మీ అభిమాన కొమ్మూరివారి మిగతా నవలలన్నీ సంక్రాంతికి అందిస్తారట. నవభారత్' వారి పుస్తకాలు అన్ని పుస్తకాల షాపుల్లోనూ దొరుకుతాయి.

నీ
రాధ

వారి అడ్రస్సు : నవభారత్ బుక్ హౌస్
ఏలూరురోడ్డు • విజయవాడ

విమల రావలసిన నిశ్చయాని మునుపే వచ్చేసింది తల్లిదండ్రుల దగ్గర సెలవు తీసుకుని పాపాతో కలిసి రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్ళి రిజిస్టర్ మేరేజి చేసుకుంది. అనంతమూర్తి వసంతా సాక్షులుగా ఉన్నారు. పెళ్ళయాక వాళ్ళిద్దర్నీ మూడు రోజులు తన యింటనే వుంచుకున్నారు. తర్వాత చిన్నయిలు అదెలా తీసుకుని వాళ్ళిద్దరూ కొత్త కాపరానికి వెళ్ళిపోయారు.

* * *

జీవితం ఒక్కోదశ చకచక జరిగిపోయినటనిపిస్తుంది. ఒక దశ నెమ్మదిగా సాగినటనిపిస్తుంది. ఎందుకో కొందర్ని చూస్తోంటే వాళ్ళ యవ్వనాలు అతివేగంగా దాటేసి వృద్ధాప్యంలో ఎన్నో వందల సంవత్సరాలు జీవించినట్లనిపిస్తుంది.

రాఘవ పెద్ద కొడుకు రామం తండ్రితో సంబంధం లేకుండా ఎక్కడో వుంటున్నాడు. రోజుకో ఉద్యోగం చేస్తాడు ఏం చేస్తాడో ఎవరికీ తెలియదు. ఒకసారి ఉద్యోగమంటాడు. ఒకసారి బిజినెస్ అంటాడు తను చాలా మేధావిననుకుంటూ వుంటాడు పైకి వచ్చిన వాళ్ళందరూ నిజానికి అప్రయోజకులనీ. అనవసరంగా పైకి వచ్చారనీ అనుకుంటూ వుంటాడు. తనకు ముందు ముందు మంచి రోజులు వస్తాయనీ ఉజ్జ్వలమైన భవిష్యత్తు వుందనీ, అప్పుడు దేశాన్ని ఉద్ధరించేస్తాననీ ఎదురుచూస్తూ వుంటాడు

రెండోవాడు వాసు ఇంజనీరింగ్ ప్యాసయ్యాక మంచి వుద్యోగమే వచ్చింది. అది కాకినాడలోనే. పెళ్ళికూడా అయింది. అతని భార్య అపర్ణ కూడా ఉద్యోగం చేస్తుంది ఉమెన్స్ కాలేజిలో.


ఆ తల్లీ, కోడలుకూ క్షణం పడదు. ఎప్పుడూ ఏవేవో సమస్యలు. నిరంతరం రణగొణధ్వని.

పిల్లల కోసం తన సర్వస్వమూ ధారపోశాడు. తను ఇప్పుడు రిటైర్ కాబోతున్నాడు. జీవితంలో ఇంటి కోసం. పెళ్ళాం కోసం. పిల్లల కోసం శ్రమపడి శ్రమపడి అలిసిపోయాడు. ఇహ విశ్రాంతి తీసుకునే రోజులు వస్తున్నాయి. అతనేదో వాంఛిస్తున్నాడు వాళ్ళ నుంచి విధేయత, మెచ్చుకోలు ఆదరింపు. సేవలు, సుఖాలు.... ఏవేవో కోరుకుంటున్నాడు.

కాని ఏమీ జరగటం లేదు.

అంతేకాదు అందుకు భిన్నంగా కూడా జరుగుతోంది.

వాసు మునుపటి మనిషిలా కనబడటం లేదు. తనను చూసి విసుక్కుంటున్నట్లు, తనకు దూరంగా జరుగుతున్నట్లూ, తన ఉనికి భరించలేనట్టూ కనబడుతున్నాడు. నిజమేనా అది? భ్రమా? లక్ష్మి కూడా అలాంటి అభిప్రాయం వెలిబుచ్చింది. తాను వాడికేం అన్యాయం చేశాడు? అప్పులు చేసి చదివించాడు. వాడు పరీక్షలు ప్యాసు కావటం కోసం అలమటించిపోయాడు. ఇవన్నీ వాడు ఒక్కసారికూడా ఆలోచించడా? వాడికి అక్కర్లేదా?



మూర్తిని కలుసుకున్నప్పుడు తన బాధంతా వెళ్ళగక్కుకున్నాడు.

"నీ బాధలో అపరిపక్వత వుంది" అన్నాడు మూర్తి.

రాఘవ అతని వంక దీనంగా చూశాడు. "మూర్తీ! చిన్నప్పట్నించీ ఎన్నో అంశాలలో నన్ను వ్యతిరేకిస్తూ వచ్చావు. కనీసం ఈ మనోవ్యధలోనన్నా ఏకీభవించవా?' అన్నాడు.

"ఏకీభవించను.'

రాఘవ జాలిగా చూశాడు.

"పిల్లలను పైకి తీసుకురావటం తల్లి తండ్రుల బాధ్యత, కర్తవ్యం. కాని పిల్లల నుంచి తిరిగి అలాంటి బాధ్యతను ఆశించటం చిన్నపిల్ల చేష్ట. పిల్లల ఎదుగుదల చూసి ఆనందించాలి. ఆ ఎదుగుదలలో ని మన పాత్రని పదేపదే గుర్తు చేసుకోవటం సంకుచితం. మనం పంచిన ప్రేమ తిరిగి పొందాలనుకోవటం స్వార్థం కాకపోవచ్చు, కాని మూర్ఖత్వం. పదే పదే మన ఉనికి. మనం చేసిన ఉపకారాన్ని గుర్తు చేస్తూ వుండటం, గుర్తు చేసుకుంటూ వుండటం ప్రకృతి."

"మరి అవసానదశలో మిగిలేదేమిటి?"

"నీ బాధ్యతల్ని నువ్వు సక్రమంగా నిర్వర్తించాననే తృప్తి నీ జీవితాన్ని నువ్వు సంపూర్ణంగా జీవించావన్న సంతృప్తి."

"మరి ఈ దశలో వాళ్ళనుంచి కొన్ని అవసరాలుంటాయి కదా"

"ఏమీ వుండక్కర్లేదు. అక్కర్లేకుండా ముందునుంచే ప్లాన్ చేసుకుంటే, ఏమీ ఆధారపడటమూ వుండదు ఆశించటమూ వుండదు. రాఘవా నువ్వు ఒకరికిచ్చింది. తిరిగి తీసుకోవాలనుకోవటం మంచి ఆలోచనగా కనబడటంలేదు. కొందరికి కాకతాళీయంగా అలా జరిగితే అది వేరే విషయం. ఎదురు చూడటం — యిందాక చెప్పానే అపరిపక్వతే"


రాఘవకు తృప్తిగా లేదు. విరిగిన మనసుతో. వొంగిన తనువుతో అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

* * *

రిటైరయే రోజు వచ్చేసరికి రెండో కూతురు నిర్మల పెళ్ళికూడా చేసేశాడు.

ప్రావిడెంట్ ఫండ్‌లో దమ్మిడీ చేతికి రాలేదు.

ఇంట్లో ఏమీ తోచదు. ఇదివరకు




రోజుల తరబడి ఆఫీసుకు సెలవు పెట్టటానికి యింట్లో ఎన్నో సమస్యలు కనబడుతూ వుండేవి. ఇప్పుడు శాశ్వతంగా సెలవుపెట్టి యింట్లో కూర్చుంటే వ్యాపకమే కనబడటంలేదు. ఎగిరే పిట్టల్ని చూస్తాడు. దారినపోయే మనుషుల్ని చూస్తాడు. సాయంత్రాలు రోడ్ల మీద ఉత్సాహంగా ఆడుకునే పిల్లల్ని చూస్తాడు. మనసులో ఏదో బరువుగా, దిగులుగా కదలినట్లవుతుంది.

భార్యకు జబ్బు చేసింది. క్షీణించిపోతోంది.

చేతిలో డబ్బులేదు. కొడుకు కొంతవరకూ పెడుతున్నాడు సరిపోవటంలేదు. తమ యింటి మీద అప్పుచేసి తెస్తున్నాడు. యిదివరకే అప్పులున్నాయి.

డాక్టర్లకు మొదట రోగం అంతుపట్టలేదు. తర్వాత కేన్సరని తేల్చారు.

భోరుమని విలపించి హైదరాబాద్ తీసుకెళ్ళాడు.

అప్పటికే చాలా ఎడ్వాన్స్ అయిందని చెప్పి, తాము చేయవలసింది చేసి ఇహ తీసుకువెళ్ళమన్నారు.

ఎవరో హోమియోపతీలో మంచి మందులున్నాయన్నారు. ఇంటికి తీసుకొచ్చి అదీ వాడుతున్నాడు.

ఇంటిమీద అప్పులు పెరిగిపోతున్నాయి కాకట్లు వాకట్టుగా మారి కోర్టులోకి ఎక్కి, ఇల్లు ఖాళీ చెయ్యాలని ఆజ్ఞలు వచ్చాయి.

"నా కోసం శ్రమపడకండి. నేనింక బ్రతకను" అంది లక్ష్మి. అప్పటికి చిక్కి శల్యమైపోయి బొమికలమీద చర్మం కప్పినట్లుగా వుంది. నూతిలోంచి వస్తున్నట్లుగా వుంది గొంతు.

రాఘవకు బావురుమని ఏడవాలనిపించింది. ఈ వ్యక్తితో కొన్ని వందల సంవత్సరాలు గడిపినంత సుదీర్ఘంగా గడపాడు. ఆమె కోసం తన సర్వం అర్పించాడు.

"లేదు లక్ష్మి నువ్వు లేకపోతే నేను కూడా బ్రతకలేను. నిన్నెట్లా అయినా బ్రతికించుకుంటాను. బ్రతికేటట్లు చేస్తాను"

ఎవరో తాయతులు కట్టమంటే కట్టాడు. భూతశాంతి చేయించమంటే చేయించాడు. ఎవరో సాధువు జపాలుచేసి చచ్చిపోయే మనుషుల్ని కూడా బ్రతికిస్తాడని చెబితే ఆయన్ని తీసుకొచ్చి బోలెడు డబ్బు ఖర్చుపెట్టి అవన్నీ చేయించాడు.

"నాకు విమలని చూడాలని వుందండీ" అంది లక్ష్మి.

వెళ్ళి విమలనూ, ఆమె భర్తనూ తీసుకొచ్చాడు. నిర్మలా, ఆమె పెనిమిటీ అంతకు ముందే వచ్చారు.

విమల, తల్లి కుష్కించిన దేహంమీద పడి బావురుమంది.

లక్ష్మి కళ్ళలోంచి నీళ్ళు కారటానికి కూడా లేనంతగా వంట్లోని నీరంతా ఎండిపోయింది.

తర్వాత మగతలోకి వెళ్ళిపోయింది.

ఆమె చావు బ్రతుకుల్లో వుందని తెలుసుకుని డిక్రీ పొందినవాళ్ళు, వచ్చి, ప్రాణం పోవటానికి ముందే బయట పెట్టమని హెచ్చరించారు. ఏమీ ఎదురు చెప్పటానికి వీల్లేకపోయింది. బయటకు తీసుకొచ్చారు.

వర్షం. రాత్రి వేళ.

లక్ష్మి ప్రాణం ఇంకా పోలేదు.

"నా లక్ష్మి తడిసిపోతోంది. నా లక్ష్మి తడిసిపోతోంది" అని రాఘవ గోల పెట్టాడు.

అనంతమూర్తి దగ్గరుండి షామియానా లాంటిది కట్టించాడు.

లక్ష్మి తనకు తెలియని దశలో ఎన్నో సంవత్సరాలు నివసించిన యింటి బయట గంటల తరబడి మరణ యాతన పడుతున్నంతసేపూ వర్షం కురుస్తూనే వుంది. ఆమె ప్రాణం పోయాక వర్షం వెలిసింది.

* * *

అనంతమూర్తికి అమెరికా నుంచి ఆహ్వానం వచ్చింది. దేశంలోని ఉత్తమ పత్రికా సంపాదకులలో ఒకరిగా అతన్ని గుర్తించిన ఫలితంగా రెండు నెలలపాటు తమ దేశంలో పర్యటన చేయవలసిందిగా కోరింది.

అతని కొడుకు మోహన్ అప్పటికే భార్యతో రెండేళ్ళుగా అమెరికాలో వుంటున్నాడు. ఎన్నోసార్లు తలితండ్రులను తన వదకు వొచ్చి వుండవలసిందిగా కోరుతూ ఉత్తరాలు రాశాడు. అతను రాయగా రాయగా వసంత మూడు నెలల క్రితమే కొన్నాళ్ళపాటు వుండివద్దామని వెళ్ళింది. అనంతమూర్తి ఇక్కడ తల పెట్టిన అనేక కార్యభారాలవల్ల వెళ్ళలేదు.

అమెరికాలో భర్తను మొదటి సారి కలుసుకున్నప్పుడు వసంతకు కళ్ళనీళ్ళు తిరిగాయి.

"చాలా చిక్కిపోయారు" అంది.

"ఈ మాట ఆడది ఎప్పుడు అనటం మానేస్తుందో, సృష్టిలో అప్పుడు క్రొత్తశకం ప్రారంభమవుతుంది" అన్నాడు నవ్వుతూ.

"పొండి"

అతని పర్యటన ప్రత్యేక కార్యక్రమంగా ఏర్పాటు చెయ్యబడిందికాబట్టి ఎక్కువ భార్యతో గానీ. కొడుకు కోడళ్ళతోగాని గడపటానికి వీల్లేకపోయింది, చివరి మూడు నాలుగు రోజులూ మాత్రం కలసివున్నాడు.

"ఏమిటి? మరి నాతో వస్తున్నావా?"

"అత్తయ్య ఇంకా కొన్ని రోజుల

పాటు మాతో వుండి పస్తారులే అంకుల్. మేమెలాగూ ఇప్పట్లో రాముకదా" అంది క్రిష్టియన్ కోడలు పరిమళ.

"ఆల్ రైట్"

"ఆల్ రైట్ అనక ఇంకేమంటారు? ఆయనకొపత్రిక వుందిగా నాకు పవతి లాగా" అంది ఉక్రోషంగా వసంత.

అనంతమూర్తి నవ్వాడు "నీ సవతికి కొద్ది రోజుల్లోనే విడాకులిచ్చేస్తున్నాను డార్లింగ్" అన్నాడు.

* * *

స్వదేశం తిరిగి వచ్చాక అతనికి భారీ ఎత్తున సన్మానం ఏర్పాటు చెయ్యబడింది. మొదట్లో అతను చాలాసేపు ఒప్పుకోలేదు. కాని, సన్మాన కమిటీ వాళ్ళు అతన్ని బలవంతం చేసి మెడలు విరిచి ఒప్పించారు.

సన్మానం కని విని ఎరుగనంత వైభవంగా జరిగింది. తనకు ఇంత మంది అభిమానులూ, తన భావాల్ని ఇష్టపడేవాళ్ళూ వున్నారని అనంతమూర్తికి మొదటిసారిగా తెలిసింది. అతని కనులు చెమర్చాయి.

సభ ఆఖర్న అతను జవాబుచెప్పే ఘట్టం వచ్చింది.

మైక్ ముందుకు వెళ్ళి నిలబడ్డాడు.

తన కృతజ్ఞతలు తెలిపాడు ముందుగా.

"జీవితంలో ఏమన్నా సాధించానో లేదో నాకు తెలీదు. కాని జీవితం మాత్రం నా తృప్తి మేరకు జీవించాను."

సభలో కరతాళధ్వనులు.

"నాది కాని జీవితం జీవించటం నాకు చేతకాలేదు. నేను ప్రేమించే వ్యక్తి నా తల్లిదండ్రులు కానివ్వండి, భార్య కానివ్వండి, పిల్లలు కానివ్వండి- నేను నేనుగా జీవించటానికి అడ్డువచ్చేలా ఎప్పుడూ చేసుకోలేదు."

మళ్ళీ హర్షధ్వానాలు.

నాకో అభిరుచి ఉంది. జీవితాన్ని ఆ అభిరుచి ప్రకారం తీర్చిదిద్దుకోవటానికి నేను శ్రమించాను. ఎవరు ఎన్ని అపార్థాలు చేసుకున్నా చలించలేదు. నా మనసు ఆరోగ్యంగా వుందని తెలిసినప్పుడు, నేను రహదారి మీద నే ప్రయాణం చేస్తున్నాననే ఆత్మ విశ్వాసం వున్నప్పుడు, ఆ దారి ఎందుకు మళ్ళాలో నాకర్థం కాదు. ప్రేమ అంటే వారి కోసం మన జీవితాలు బలిచేసుకోవటం కాదు. మన జీవితాలని సార్థకం చేసుకుంటూ వారి జీవితాలని కూడా వెలిగించాలి. ఇతరుల కోసం, వాళ్ళ సుఖాల కోసం, వాళ్ళని సంతోష పెట్టటం కోసం మనల్ని మనం ఎందుకు పోగొట్టుకోవాలని మొదట "నేను" అంటే స్వార్థంతో కాదు, అహంతో కాదు, అజ్ఞానంతో కాదు, మూర్ఖత్వంతో కాదు. నన్ను వికసింప చేసుకుంటూ "నేను" నేను వికసించనిదే ఇతరుల్ని వికసింప చేయలేను.

జనం ముగ్ధులై వింటున్నారు.

"....తర్వాత మీ అందరి సమక్షంలో ఈవేళ ఓ నిర్ణయం తీసుకుంటున్నాను.

"మనిషి కొన ఊపిరి తీసే వరకూ వృత్తి తాపత్రయంలో వుండటం సమంజసం కాదు. యువతరం వస్తోంది దూసుకుని మన నీడలో వాళ్ళని చూసుకుని ఆ నిషాలో మునిగి పోవటం కన్నా, మనం తప్పుకుని


## మా స్వంత ప్రచురణలు

### చదవండి—చదివించండి

### విజ్ఞాన, వినోద మానసోల్లాసానికి

| | | | |
|---|---|---|---|
| మనసు _ మనువు | — | మునిపల్లి సరోజినీ దేవి | రు. 4-50 |
| పంతాలూ _ పర్యవసానాలు | — | మునిపల్లి సరోజినీ దేవి | రు. 4-50 |


అతి త్వరలో మరో మూడు నవలలు

| | | | |
|---|---|---|---|
| సంధ్య విసిరిన సంపంగి | — | ఎస్. ఝాన్సీరాణి | రు. 7-50 |
| పసిడి పంజరం | — | ఎస్. ఝాన్సీరాణి | రు. 5-50 |
| స్నేహమందిర్ | — | సి.హెచ్. కరుణాదేవి | రు. 4-50 |
| గొబ్బిముళ్ళు | — | శ్రావణశ్రీ | రు. 10-00 |
| చక్కని రాజమార్గం | — | ఎం. రామకోటి | రు. 5-50 |
| అనుభూతీ నీకు మరణంలేదు | — | ప్రశాంత | రు. 7-50 |
| మల్లెల మనసులు | — | ఎ. బి. వి. నరసింహారావు | రు. 6-50 |
| జీవిత వలయాలు | — | డి. జి. కె. రాజు | రు. 4-50 |

## నటరాజ పబ్లికేషన్స్

మసీదు స్ట్రీట్ — ఏలూరు రోడ్

### విజయవాడ - 2



మన కళ్ళ ముందే ఆ యువతరం మన కన్నా ఎలా ఎదుగుతుందో చూడటం నాకు సంతోషం. అది నా కర్తవ్యంగా కూడా భావిస్తాను. ఈ చరమాంకంలో ఊపిరి సలపనట్టుగా కాకుండా, హాయిగా తిరిగా ఊపిరితీస్తూ, ఒత్తిడుల మధ్య కాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తూ, నా భావాలకు స్వరూపాలని ఇచ్చుకుంటూ నా రచనా కార్యక్రమాలని నిర్వహించాలి. ఇన్ని సంవత్సరాల జీవితానుభవంతో నాకిప్పుడు విరివిగా రాయాలనిపిస్తోంది. బుద్ధిపుట్టినప్పుడు ఊళ్ళు తిరుగుతూ, బుద్ధి కుదిరినప్పుడు రాసుకుంటూ గడపాలని నా ఆకాంక్ష. అందుకు ఈ వేళ నా ఉద్యోగ విరమణను ప్రకటిస్తున్నాను."

తన సన్మానానికి కృతజ్ఞతలు చెప్పగానే చప్పట్లు.... చప్పట్లు.... చప్పట్లు.... సభా మందిరమంతా మారుమ్రోగిపోయింది.

అనంతమూర్తి చుట్టూ మూగినవాళ్ళలో నందన ఆమె భర్త, కుమారి, ఆమె భర్త కూడా వున్నారు.

"నాన్నా! నువ్వు మా ఇంట్లోనే వుండాలి మా దగ్గరే వుండాలి"

ఆ కూతుళ్ళ హృదయాలు బాధపడుతున్నాయి.

కానీ వాళ్ళకు తెలుసు అది నిరుపయోగమైన ఘోష అని.

రాఘవ మాత్రం కుర్చీలోంచి లేవకుండా చాలాసేపు వుండిపోయాడు.

ఆ జనంలో అనంతమూర్తి కళ్ళు అతని కోసం వెతికాయి. ఎక్కడున్నాడో కనబడలేదు.

అంతా వెళ్ళిపోయాక రాఘవ నెమ్మదిగా లేచి బయటకు వచ్చాడు.

ఇల్లెక్కడో వుంది.

నడుస్తున్నాడు. ఒక్కొక్క అడుగూ ఒక్కొక్క సత్యం చెబుతుంది. నడవలేక అడుగు పడనప్పుడు సత్యం బాధగా మూలుగుతోంది.

ఇంటికి వచ్చి తలుపు బాదగా బాదగా కోడలు వచ్చి తలుపు తీసింది.

"అన్నం బల్లమీద వుంది" అని చెప్పి మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయింది.

రాఘవ తన గదిలోకి వెళ్ళి నేలమీద కూర్చున్నాడు. ఆ ఇరుకు గదిలో గోడ ప్రక్కన ఓ పెట్టె వుంది. సంవత్సరాల నాటి పాతకాలపు ట్రంకు పెట్టె.

దాని దగ్గరకు జరిగి వణికే చేతుల్తో మూత తెరిచాడు. పాత బట్టలున్నాయి. భార్యతో తీయించుకున్న పెళ్ళినాటి ఫొటో ఉంది. ఆమె చీరెలున్నాయి. అన్నీ బయటకు తీశాడు.

అడుగున....

అలనాటి పిల్లనగ్రోవి పడి వుంది.

వణికే వ్రేళ్ళతో అందుకున్నాడు.

ఏనాటిమాట?

దగ్గరకు తీసుకుంటున్నాడు.

ఎప్పటి సముద్రతీరం?

నోటి దగ్గర పెట్టుకుంటున్నాడు.

ఎన్ని యుగాలయింది?

అసలీ జన్మలోనేనా?

పెదవుల కానించాడు-

వణికే పెదవులు....

కాని ఊదాయి.

మురళి మ్రోగలేదు

మళ్ళీ ఊదాడు

ఊహూ. ఏ ధ్వనీ రాలేదు.

ముఖం వివర్ణమైపోయింది. కనులు చెమరుస్తున్నాయి.

వేణువు చెడిపోయిందా?

కాదు. చెడిపోయింది జీవితమే.

ఆ తెల్లవారు ఝామునే అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

* * *

స్నేహితులిద్దరూ సూర్యుని కేసి చూస్తున్నారు.

నిప్పులు కక్కే అగ్నిగోళం నెమ్మదిగా నీళ్ళని సమీపించింది.

కాస్త కాస్త చొప్పున మునిగిపోతోంది.

అనంతమూర్తి కళ్ళు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

ఎంత అద్భుతంగా వుంది దృశ్యం.

ఓ ప్రపంచం మరో ప్రపంచంలోకి జారబడినట్లు.

ఓ సృష్టి మరో సృష్టిలో లీనమైనట్లు....

"ఓ వెలుగు, మరో వెన్నెలలో కలిసిపోయినట్టు." అనంతమూర్తి ఉలికి పడ్డాడు.

రాఘవ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

"వెళ్ళిపోయాడు. తన వారిని తానే తీసుకుపోయి, నా కేమీ ఇవ్వకుండా"

మూర్తి అతని భుజంమీద చెయ్యివేసి లాలనగా అన్నాడు. "ఏమిటి రాఘవా! ఏమిటీ పిచ్చి"

రాఘవ వినిపించుకోవటంలేదు. అతని కళ్ళముందు ఏవేవో రూపాలు మెదుల్తున్నాయి. తల్లిదండ్రులు, సీత, ఉద్యోగం, భార్య, పిల్లలు, పిల్లనగ్రోవి....

"పోగొట్టుకున్నాను. పోగొట్టుకున్నాను. మళ్ళీ రానిది, రాలేనిది. దగ్గరకు వచ్చినప్పుడు తాకకుండా, చెదిరిపోతూ, మైకంలో మునిగిపోతూ. అజ్ఞానానికి అనేక నిర్వచనాలు చెప్పుకుంటూ.... పోగొట్టుకున్నాను."

"రాఘవా! ఏమిటిది చంటిపిల్లాడిలా?"

"అతని తప్పేంలేదు ఉదయించాడు. వెలుగునిచ్చాడు ఎంతోసేపు. అయినా చీకట్లోనే కూర్చున్నాను. ఇప్పుడు వెళ్ళిపోయాడు—నిజంగానే చీకటి చేసి."

రాఘవ ఏడుస్తున్నాడు. నిజంగానే చీకటి నలువైపులా వ్యాపించింది.

(సమాప్తం)